
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



విశాఖపట్నం

జిల్లా వార్తలు

సోమవారం 8 ఏప్రిల్ 2024

జనసేనానికి నీరాజనం

అనకాపల్లిలో వారాహి విజయభేరి యాత్రకు బ్రహ్మరథం

- అభిమాన నేతపై దారి పొడవునా పూలవర్షంతో స్వాగతం
- అడుగడుగునా మంగళ హారతులు పట్టిన మహిళలు
- గజమాలతో అభిమానుల ఘన సత్కారం

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం అనకాపల్లి నెహ్రూ చౌక్‌లో నిర్వహించిన వారాహి విజయభేరి యాత్రకు జనం బ్రహ్మరథం పట్టారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, కూటమిలోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో అనకాపల్లి జన సంద్రాన్ని తలపించింది. సుంకరమెట్ట కూడలి నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీగా వచ్చిన జనసేనానికి అఖండ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెహ్రూ చౌక్‌లో జరిగిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో వైసీపీ కోడి ఒక గుడ్డు పెట్టింది, ఒక డిప్యూటీ సీఎంను ఇచ్చింది కానీ ఒక మంచి రోడ్డు వేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. అనకాపల్లి ఎంపీగా సీఎం రమేశ్‌ను గెలిపించుకుంటే కేంద్రం సహకారంతో ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఉత్తరాంధ్ర సమస్యలపై తరచూ గళమెత్తే నేత కొణతాల రామకృష్ణ ఎమ్మెల్యేగా గెలిస్తే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

అనకాపల్లి నెహ్రూ చౌక్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరైన అశేష ప్రజానీకం





అనకాపల్లిలో జనసేనాని పవన్‌కల్యాణ్ రోడ్‌షోలో పాల్గొన్న అశేష జనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7: వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం సాయంత్రం అనకాపల్లి వచ్చిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. జలగలమదుం జంక్షన్ సమీపాన ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు పవన్‌కల్యాణ్ హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3.45 గంటలకు వచ్చారు. ఆయనకు బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీవీ నారాయణరావు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, జనసేన అభ్యర్థులు పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, కూటమి పార్టీల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. పవన్‌కల్యాణ్‌ను కొణతాల రామకృష్ణ సత్కరించి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం పలువురు నాయకులు కొణతాల సమక్షంలో జనసేనలో చేరారు. సాయంత్రం 5.25 గంటలకు వారాహి విజయయాత్ర హెలీప్యాడ్ నుంచి ప్రారంభమైంది. ఈ ర్యాలీ సత్తెమ్మ తల్లి ఆలయ ముఖద్వారం, ఆంధ్రాబ్యాంక్ రోడ్డు, వన్‌వే ట్రాఫిక్ జంక్షన్, చేపల బజారు మీదుగా నెహ్రూచౌక్‌కు సాయంత్రం 6.30 గంటలకు చేరుకుంది. ఓపెన్ టాప్ వాహనం పైనుంచి ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. దారి పొడవునా అభిమానులు, పార్టీ నాయకులు పూలవర్షం కురిపించారు. పలుచోట్ల మహిళలు మంగళహారతులు ఇచ్చారు. రింగు రోడ్డు జంక్షన్‌లో ఒక యువతి చేతిలో హారతిని ... మిగతా 4వ పేజీలో

కూటమితోనే భవిష్యత్తు



- విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయండి
- వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

వారాహి విజయభేరి సభలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్

అనకాపల్లి/ కొత్తూరు/ అనకాపల్లి టౌన్ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే భవిష్యత్తు బాగుంటుందని, ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం అనకాపల్లి నెహ్రూ చౌక్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. యువతకు ఉపాధి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి, మూతపడిన చక్కెర కర్మాగారాల పునరుద్ధరణ, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ మన ముందున్న సవాళ్లని, కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే ఇవన్నీ సాధ్యమవుతాయన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమే జనసేన పోరాడుతోందని, అధికారం కోసం కాదని పవన్ స్పష్టం చేశారు.

నూకాలమ్మ జాతరకు రాష్ట్రస్థాయి గుర్తింపు..

అనకాపల్లి నూకాలమ్మ జాతరను రాష్ట్ర స్థాయి పండగలా నిర్వహిస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఇక్కడ ప్రజలకు రెండు పూటలా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని, రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు ఇస్తామన్నారు.

కోడిగుడ్డు మంత్రిని తట్టుకోలేని సీఎం

కోడిగుడ్డు మంత్రి అవినీతిని తట్టుకోలేకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమర్‌నాథ్‌కు అనకాపల్లిలో టికెట్టు ఇవ్వలేకపోయారని పవన్ ఆరోపించారు. కశింకోట మండలం విస్సన్నపేటలో భూ కుంభకోణానికి పాల్పడిన మంత్రి తన బినామీలతో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఇనాం భూములను దోచుకున్నారన్నారు. పిసినికాడలో 80ఎకరాల దళితుల అసైన్డ్ భూమిని తక్కువ ధరకు లాక్కున్నారన్నారు. జగనన్న కాలనీల్లో భూములను అమ్ముకున్నారని, కూటమి అధికారంలోకి రాగానే వీటన్నింటిపై విచారణ చేపడతామని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గురించి వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఆ పార్టీ నాయకులకు డ్యాన్స్‌లు వేయడం తప్ప సమాధానం చెప్పే సత్తా లేదన్నారు. పోలవరం పూర్తికి కేంద్ర సహాయం అవసరమని, ఇందుకోసం సీఎం రమేశ్ విజయం కీలకమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యలను పరిష్కరించుకుని, సొంత గనులు కేటాయించేలా చూస్తానన్నారు. అందరం కలిసి వస్తే ప్లాంట్ పరిరక్షణ సాధ్యమేనన్నారు.



బెల్లందిమ్మ చూపుతున్న పవన్ కల్యాణ్. చిత్రంలో అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, బుద్దా నాగజగదీశ్వరరావు ఉన్నారు.

కొండెక్కిన థీమ్‌పార్క్

మాటలకే పరిమితమైన ముడసర్లోవ పార్కు అభివృద్ధి

- రూ.120 కోట్లతో రిజర్వాయర్‌లో బోటింగ్, రిక్రియేషన్ సదుపాయాలకు ప్రణాళిక
- సర్కారుకు ప్రతిపాదనలు పంపిన జీవీఎంసీ
- ఇప్పటివరకు స్పందించని రాష్ట్ర ప్రభుత్వం
- నగరవాసుల నుంచి వెల్లువెత్తిన విమర్శలు
- ఎన్నికల వేళ నష్టం జరగకుండా వైసీపీ నేతల చర్యలు
- జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులకు ప్రణాళిక
- రూ.30 లక్షలతో పిల్లలకు ఆటపరికరాల ఏర్పాటుతో సరి



ముడసర్లోవ పార్కు



పార్కులో విరిగిపోయిన పెద్దు



విరిగిపోయి వృథాగా మారిన ఆట పరికరాలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరంలో అతిపెద్దదైన ముడసర్లోవ పార్కుని అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెద్దలు గొప్పలు చెప్పారు. సుమారు 800 ఎకరాల్లో విస్తరించిన పార్కులో పిల్లల నుంచి వయోవృద్ధులు వరకూ అన్నివర్గాలవారికి ఆహ్లాదం కలిగేలా థీమ్‌పార్కు పేరుతో అభివృద్ధి చేయడంతోపాటు పార్కుని ఆనుకుని ఉన్న రిజర్వాయర్‌లో బోటింగ్ సదుపాయం కల్పించి పర్యాటకులను ఆకట్టుకుంటామని ప్రగల్భాలు పలికారు. ఇందులో భాగంగా నాలుగేళ్ల కిందట రూ.120 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదానికి పంపించారు. అయితే ఇంతవరకూ ఈ ప్రతిపాదనపై అతీగతీలేదు.

ఆరిలోవ నుంచి సింహాచలం బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకుని ముడసర్లోవ పార్కు ఉంది. జీవీఎంసీకి చెందిన ఈ పార్కు దాదాపు 800 ఎకరాల్లో విస్తరించి ఉంది. ముడసర్లోవ రిజర్వాయర్ ఒక వైపు, గోల్ఫ్ కోర్ట్ మరోవైపు ఉండడంతో పార్కు నిత్యం సందర్శకులతో కళకళలాడుతుండేది. పార్కు నిర్వహణపై జీవీఎంసీ నిర్లక్ష్యం వహించడంతో ఇక్కడి చిన్నపిల్లల ఆట వస్తువులు మూలకు చేరాయి. వాటర్‌ఫౌంటెన్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కార్తీకమాసంలో పిక్నిక్‌లకు మినహా మిగిలిన రోజుల్లో సందర్శకుల సంఖ్య పెద్దగా ఉండడం లేదు.

గత ప్రభుత్వంలోనే అభివృద్ధి ప్రణాళిక

నగరానికి తలమానికంగా నిలిచే ముడసర్లోవ పార్కును అభివృద్ధి చేస్తే సందర్శకులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి ... మిగతా 4వ పేజీలో

ఆరోగ్యశ్రీ బిల్లులకు మోక్షమేదీ?



ఏడు నెలలుగా చెల్లింపులు నిలిపివేసిన ప్రభుత్వం

- ఒక్కో ఆస్పత్రికి కనీసం రూ.25 లక్షల నుంచి రూ.10 కోట్ల వరకు బకాయిలు
- జిల్లాలో 55 ఆస్పత్రులకు రూ.70 కోట్ల మేర పెండింగ్
- వైద్య సేవల నిలిపివేతకు యాజమాన్యాల హెచ్చరిక
- నామమాత్రంగా నిధులు విడుదల చేసిన సర్కారు
- ఆందోళనలో ఆస్పత్రుల యాజమాన్యాలు
- నిరుపేద రోగులకు తప్పని ఇక్కట్లు



విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):

ఆరోగ్యశ్రీలో పేదలకు ఉచిత వైద్యం అందించిన నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించడంలో జగన్ ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. ఏడు నెలలుగా పెండింగ్‌లో పెట్టడంతో జిల్లాలో సుమారు రూ.70 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. దీంతో వైద్య సేవలు నిలిపివేస్తామని ఆస్పత్రుల యాజమాన్యాలు హెచ్చరించగా నామమాత్రంగా చెల్లించి చేతులు దులుపుకోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చే రోగులకు ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలు అందించేందుకు నిరాకరిస్తున్నాయి.

జిల్లాలో 55 ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలుచేస్తుండగా వాటికి సుమారు ఏడు నెలలుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలేదు. దీంతో సుమారు రూ.70 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. ఒక్కో ఆస్పత్రికి కనిష్ఠంగా రూ.25 లక్షల నుంచి రూ.10 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. చివరిగా గత ఏడాది జూలైలో ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. ఆ తరువాత పెండింగ్‌లో పెట్టడంతో యాజమాన్యాలపై భారం పడుతోంది. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న యాజమాన్యాలు ఈ ఏడాది జనవరిలో సమ్మె నోటీసులను ఇచ్చాయి. బకాయిలు చెల్లించకుంటే వైద్యసేవలు నిలిపివేస్తామని హెచ్చరించాయి. ఎన్నికల ముందు వైద్య సేవలు నిలిపేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన ప్రభుత్వం రూ.100 కోట్లను విడుదల చేసింది. దీంతో వైద్య సేవలను కొనసాగించిన ఆస్పత్రుల యాజమాన్యాలు.. గత నెలలో మరోసారి సమ్మె నోటీసు ఇచ్చాయి. మళ్లీ కొంతమొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. రెండు దఫాల్లో విడుదల చేసిన నిధులతో ఒక నెలకు సంబంధించిన బకాయిలు మాత్రమే క్లియర్ అయ్యాయని ఆస్పత్రుల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. అంటే గత ఏడాది ఆగస్టు వరకు మాత్రమే ప్రభుత్వం బిల్లులను చెల్లించిందని, మరో ఏడు నెలల బిల్లులు చెల్లించాల్సి ఉందని చెబుతున్నాయి. దీనిపై ప్రభుత్వ పెద్దలను కలిసినా ప్రయోజనం లేకుండా ... మిగతా 4వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.15
సహరి (మంగళ)	4.29

ఉలిక్కిపడిన ఫార్మా సిటీ

- వేర్వేరు ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదం
- ఇద్దరి మృతి, నలుగురికి అస్వస్థత
- మరో ముగ్గురికి స్వల్ప గాయాలు



మృతుడు సీహెచ్. రమణ (ఫైల్ ఫొటో)



మృతుడు ఆళ్ల గోవింద (ఫైల్ ఫొటో)

పరవాడ, ఏప్రిల్ 7: విశాఖ ఫార్మాసిటీ ఉలిక్కిపడింది. శనివారం అర్ధరాత్రి, ఆదివారం తెల్లవారుజామున వేర్వేరు పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. మరో నలుగురు అస్వస్థతకు గురికాగా, ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అల్కలీ మెటల్స్ లిమిటెడ్ యూనిట్-3 పరిశ్రమలో మిథైల్ నైట్రేట్ గ్యాస్ లీక్ అవ్వడంతో కెమిస్ట్, సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సీహెచ్ రమణ(30) మృతి చెందగా, మరో నలుగురు అస్వస్థతకు గురయ్యారు. అలాగే అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-6 పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న ఆళ్ల గోవింద(32) మృతి చెందాడు. మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదాలకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

అల్కలీ పరిశ్రమలో..

అల్కలీ మెటల్స్ లిమిటెడ్ యూనిట్-3 పరిశ్రమలో ఆదివారం తెల్లవారుజాము నాలుగున్నర గంటల ప్రాంతంలో ప్రొడక్ట్ బ్లాక్‌లోని జీజీ-2 ట్యాంక్ పైపులైన్ వద్ద మిథైల్ నైట్రేట్ గ్యాస్ లీకైంది. పైపులైన్‌కు సంబంధించి ఎల్ బెండ్ వద్ద లీకేజీ కావడంతో సీ షిఫ్ట్ విధుల్లో ఉన్న సీహెచ్ రమణ (32) విపరీతంగా గ్యాస్ పీల్చడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. పైఫ్లోర్‌లో పనిచేస్తున్న కార్మికులకు గ్యాస్ వాసన రావడంతో కిందకు దిగి వచ్చి చూసేసరికి అప్పటికే రమణ అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. ఆస్పత్రికి తరలించే లోపు మార్గమధ్యంలో మృతి చెందాడు. అలాగే అతనిని చూసేందుకు వచ్చిన నలుగురు కార్మికులు ఎ.శ్రీనివాసరావు (పైడివాడ అగ్రహారం), వై.గోపాల్ (రేగడివలస), వి.అప్పారావు (లంకెలపాలెం), బి.రవీంద్ర (చోడవరం) అస్వస్థతకు గురయ్యారు. వెంటనే తోటి కార్మికులు వారిని తొలుత అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స అందజేశారు. మెరుగైన వైద్యం కోసం నలుగురిని విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం నలుగురు కోలుకున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ ప్రమాదంలో మృతి చెందిన సీహెచ్ రమణ స్వస్థలం విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ మండలంలో గల గొల్లపేట గ్రామం. ఆయన భార్య సత్యవతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత 11 ఏళ్లగా పరిశ్రమలో సూపర్‌వైజర్, కెమిస్ట్‌గా పనిచేస్తున్నారు. తానాంలో నివాసం ఉంటూ విధులకు హాజరవుతున్నారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ పరిశ్రమను సందర్శించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను కంపెనీ షిఫ్ట్ సూపర్‌వైజర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నలుగురి కార్మికుల పరిస్థితి గురించి వాకబు చేశారు.

అపిటోరియా పరిశ్రమలో..

అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-6 పరిశ్రమలో శనివారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో వీటీడీ డ్రయర్ రూములో ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న ... మిగతా 4వ పేజీలో

రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తే సహించం: సీఐ



అవగాహన కల్పిస్తున్న సీఐ అమ్మినాయుడు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 7: రహదారులు ఆక్రమించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు తోపుడు బళ్ల వ్యాపారులను హెచ్చరించారు. అక్కయ్యపాలెం నుంచి దొండపర్తి వరకు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారితో ఆదివారం సమావేశం నిర్వహించి ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది రూపాయలు వెచ్చించి రోడ్డు విస్తరించారన్నారు. అటువంటి రోడ్డును ఆక్రమించి తోపుడు బళ్లు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని, దీని వల్ల చాలా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఫుట్‌పాత్‌ను ఆక్ర మించి వ్యాపారాలు చేయడంతో పాదచారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వినియోగదారులు రోడ్డు మధ్యలోనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారన్నారు. దీంతో పాదచారులను బస్సులు, ఇతర వాహనాలు వారిని ఢీకొట్టే ప్రమాదం ఉందన్నారు. ఈ స్థితిలో తోపుడు బళ్లతో ఆ క్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ట్రాఫిక్ ఎస్సై వి.వాణిశ్రీ, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి



కళాకారులను సత్కరిస్తున్న సభ్యులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 7 : శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ప్రజలందరి జీవితాలలో వెలుగు నింపాలని వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రైల్వేన్యూకాలనీలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రమౌళి మాట్లాడుతూ, పాత్రికేయులు వారి కుటుంబ సభ్యులంతా ఒకే చోట కలిసి ఉగాది సంబరాలు జరుపుకోవడం ఆనంద దాయకమన్నారు. అనంతరం పల్సర్ బైక్ ఝాన్సీ, ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ రమేష్, జబర్దస్త్ నటుడు రాపేటి అప్పారావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ అధ్యక్షుడు పి.నారాయణ్, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రచయిత శ్రీకాంత్‌కు సత్కారం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 7: ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజాన్ని తమ సేవలతో జాగృతం చేస్తున్న కళాకారులను, పాత్రికేయులను సత్కరించారు. వారిలో నగరానికి చెందినప్రముఖ కవి, రచయిత సత్తివాడ శ్రీకాంత్‌ను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ పౌర సంబంధాల అధికారి మణిరామ్, సీనియర్ పాత్రికేయులు ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

51వ వార్డులో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదాతలు

మురళీనగర్, ఏప్రిల్ 7; 51వవార్డు మాధవధార ఉడా క్వార్టర్స్‌లో ఆదివారం విశాఖ మెరైన్ వింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని బీజేపీ నాయకులు దిలీప్ రాజు, మూల అప్పారావు ప్రారంభించారు. మెరైన్ వింగ్ నుంచి గత మూడేళ్లుగా పలు సేవా కార్యక్రమాలతోపాటు రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో యువకులు 76 యూనిట్ల రక్తదానం చేశారు. ఎస్.ఆర్.కె.రాజు తదితరులు శిబిరంలో ఉన్నారు.

రామాయణంపై సాహిత్య కార్యక్రమం

సీతమ్మధార, ఏప్రిల్ 7: విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో భవ్యరామారామం ఆధ్యాత్మిక సాహిత్య కార్యక్రమం ఆదివారం పౌరగ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు మాట్లాడుతూ, అయోధ్యలో రామమందిర నిర్మాణం, బాలరామ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యదర్శి డాక్టర్ ప్రయాగ సుబ్రహ్మణ్యం రామాయణం ప్రశస్తిని వివరించారు. నారాయణరావు శ్రీరాముని గుణగణాలు, రామరాజ్యం అనే అంశాలపై వాల్మీకి రామాయణంలో పలు శ్లోకాలు ఉదహరించారు. వి.విజయసారధి అయోధ్యలో రామ మందిర నిర్మాణ నేపథ్యం, మందిర విశేషాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డీవీ సూర్యారావు, విజయ్‌గోపాల్ పాల్గొన్నారు.

రైతుబజారు రోడ్డులో ట్రాఫిక్ సమస్య

నరసింహనగర్ రోడ్డుపై తోపుడు బండ్లు, దుకాణాల ఏర్పాటుతో అవస్థలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 7: గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారు వద్ద రోడ్డులోదుకాణాలు, తోపుడు ఆక్రమణతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికితోడు వ్యాపారుల మధ్య పోటీతో నిత్యం వాగ్వాదాలు, ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. సెలవురోజైన ఆదివారం ఉదయం, సాయంత్రం వేళల్లో నానా రభస జరుగుతోంది.ఎవరికి తోచిన రీతిలో వారు ప్రవర్తిస్తూ ఆ మార్గంలో వెళ్లే ఇతరుల సమస్యలను పట్టించుకునే పరిస్థితి ఉండదు. వివిధ ప్రాంతాల నుంచి రైతుబజారుకు నిత్యం పెద్ద సంఖ్యలో వినియోగదారులు విచ్చేస్తుంటారు. బజారు లోన పార్కింగ్ స్థలం ఉన్నా కొందరు వినియోగదారులు దాన్ని పట్టించుకోకుండా ప్రాంగణంలో వాహనాలను నిలిపి వెళ్లిపోతుంటారు. అలాగే, తోపుడు బండ్ల వ్యాపారులు ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డును సగం వరకు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుంటారు. దీంతో రాకపోకలు జరిపేవారే కాకుండా వినియోగదారులూ తమ వాహనాలను బయటకు తీసేందుకు నానాపాట్లు పడాల్సిందే. అసలే ఇరుకు రోడ్డు దీనికి తోడు సగానికిపైగా ఆక్రమించడంతో నిరంతరం సమస్య నెలకొంటోంది. కొన్నిసార్లు గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారుల సహనానికి పరీక్షగా మారుతోంది. ట్రాఫిక్ పోలీసుల, అధికారులు ఎన్ని చర్యలు చర్యలు తీసుకున్నా కాసేపటికే మళ్లీ వీరంతా తమ పని తాము చేసుకుపోతుండడంతో సమస్య తప్పడం లేదు.



నరసింహనగర్ రోడ్డుపై తోపుడు బళ్లు, పార్కింగ్ చేసిన వాహనాలు

తప్పించుకు వెళ్లాలంటే కష్టం



రైతుబజారు ఎదురుగా రహదారిని సగానికి పైగా ఆక్రమించి వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. రైతుబజారుకు వెళ్లాలంటే ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. రోడ్డుకిరువైపులా వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల వాటిని తప్పించుకుని బజారులోనికి వెళ్లలేకపోతున్నాం. అధికారులు చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలి.

-వాసు, వినియోగదారుడు

కంచరపాలెంలోనూ అదే దుస్థితి

కంచరపాలెం,ఏప్రిల్ 7: కంచరపాలెం రైతుబజారు వద్ద తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల ఆక్రమణలతో వినియోగదారులు లోనికి వెళ్లడానికి అవస్థలు పడాల్సి వస్తోంది. రైతుబజారు ప్రధాన ద్వారానికి ఇరువైపులా దుకాణాలు ఇష్టానుసారంగా వ్యాపారాలు చేస్తున్నారు. దీనికితోడు అక్కడే ఆటోలు నిలిపడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బజారు ప్రారంభంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉండడంతో వృద్ధులు, మహిళలు బజారులోకి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ట్రాఫిక్ సిబ్బంది నియం త్రణ చర్యలు తూతూ మంత్రంగా వ్యవహరిస్తుండడంతో సమస్య మరింత జటిలమవుతోంది. అసలే ఇరుకైన సర్వీస్ రోడ్డులో వాహనాలు ఇరువైపులా నుంచి వస్తుంటాయి. రోడ్డును ఆక్రమించడంతో బజారు వద్ద వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.ఇప్పటికైనా ట్రాఫిక్,జీవీఎంసీ సిబ్బంది దృష్టిని సారించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



కంచరవాలెం రైతు బజారు ఎదుట తోపుడుబడ్లు, దుకాణాలతో రద్దీ

మార్పు రావాలి... కూటమి అభ్యర్థులు గెలవాలి

» టీడీపీ విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు గండిబాబ్జీ

మురళీనగర్, ఏప్రిల్ 7; ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతికి జనసేన, టీడీపీ, బీజేపీ మూడు పార్టీల విజయం సరికొత్త దారి చూపిస్తుందని టీడీపీ విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు గండిబాబ్జీ అన్నారు. ఆదివారం విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసనసభ ఉమ్మడి అభ్యర్థి పెన్మెత్స. విష్ణుకుమార్ రాజు చేపట్టిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ 51వవార్డు అధ్యక్షులు సనపల.కీర్తి అధ్యక్షతన కూటమి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టేందుకు కూటమి నాయకులకు ప్రజలు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్, టీడీపీ స్టేట్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ జయరాజు, జనసేన పార్టీ 51వవార్డు అధ్యక్షులు జి.అప్పారావు తదితర నాయకులు ఉన్నారు.

మహారాణిపేట: తెలుగుదేశం పార్టీలోకి దక్షిణ నియోజకవర్గ పరిధి గ్రేటర్ 32వ వార్డుకు చెందిన 50 మంది చేరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గండిబాబ్జీ వీరందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, ఈ స్థితిలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. ఈ కారక్రమంలో నాయకులు పి. శ్రీనివాసరావు, దాసరి దుర్గారెడ్డి, పంపాన రాజ్యలక్ష్మి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గండిబాబ్జీ

కూటమి విజయాన్ని కాంక్షిస్తూ హనుమాన్‌కు పూజలు

టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి ఎం శ్రీ భరత్ సేవలు అవసరమని సాగునీటి వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ గోపాల కృష్ణారావు అన్నారు. కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తు హనుమాన్ జంక్షన్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి చిత్రపటం, కండువాను శ్రీభరత్ కు అందజేశారు.

'అంబికాబాగ్'లో శ్రీరామ నవమికి ఏర్పాట్లు

» 17 న శ్రీ సీతారాముల కల్యాణం



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరెడ్డి, తదితరులు

మహారాణిపేట, ఏప్రిల్ 7: అంబికాబాగ్ శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఈ నెల 17న శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు, ఆదివారం మహారాణిపేటలోని ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రామ నవమి వసంత న వరాత్రుల వేడుకల్లో భాగంగా ఈనెల 9న శ్రీసీతారాముల కల్యాణ రాట, శ్రీ రాముడిని పెండ్లికుమారుని చేయడం, ఉగాది సందర్భంగా అదే రోజు పంచాంగం శ్రవణం ఉంటుందని వివరించారు. ఈనెల 10 నుంచి 16 వ తేదీ వరకు శ్రీ సీతారామ స్వామికి విశేష ఆరాధన విశేష హోరతులు తదితర వాటిని నిర్వహించనున్నట్లు తెలిపారు. 17 వ తేదీన చైత్ర శుద్ధ నవమి సందర్భంగా శ్రీరామ నవమి పర్వదినం పురస్కరించుకొని ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం, 10 గంటల నుంచి 12 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 18వ తేదీన శ్రీ రాముని పట్టాభిషేకం జరపనున్నట్టు చెప్పారు. ఉత్సవాలకు రూ. 10లక్షల అంచనాతో వ్యయం చేయనున్నట్టు వివరించారు. ఈ ఉత్సవాల్లో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతి కార్య క్రమాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధికారులు వి. రాంబాబు , కె. తిరుమలేశ్వరరావు , సీహెచ్ వెంకటేశ్వరరావు తది తరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

జగదాంబ కూ డలి, ఏప్రిల్ 7: ఎన్నికల్లో ఎటువంటి చట్టవ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడితే కఠిన చర్య లు తప్పవని వన్‌టౌన్ సీఐ భాస్కర్ రౌడీ షీటర్లనుహెచ్చరించారు. ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌటీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు క్రిమినల్ చర్యలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయపార్టీల మద్దతుగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రౌడీషీటర్ల ప్రతీ కదలికపై నిఘా ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సీతమ్మధార, ఏప్రిల్ 7 : నిర్వహణ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. గాంధీనగర్ ఏరియా, ఎంఆర్వో ఆఫీస్ ఏరియా, పోస్టాఫీసు ఏరియా, బేఫేషన్ ఏరియాల్లో కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా నూకాంబిక మహోత్సవాలు



బర్మాక్యాంపులో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

మాధవధార, ఏప్రిల్ 7; గ్రేటర్ 49వ వార్డు బర్మాక్యాంపు శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో కొత్త అమావాస్య నవరాత్రి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలు, నూతన వస్త్ర ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు శూలాల ప్రదర్శనలతో అమ్మవారి సన్నిధికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కంచరపాలెం, ఊర్వశి జంక్షన్, మాధవధార, ఎన్‌జీజీఓస్ కాలనీ, కప్పరాడ కొండ ప్రాంతాల నుంచి వేలాది జనం కుటుంబాలతో అమ్మవారి దర్శనాలకు చేరుకున్నారు. ప్రత్యేక మందిర అలంకరణలో అమ్మవారిని ప్రతిష్ఠించిన తలపై పసుపు బిందెల నీళ్లతో వచ్చి ప్రదక్షిణ చేశారు. అర్చకులు చిట్టిబాబు శర్మ పర్యవేక్షణలో పూజలు జరిపారు. సాయంత్రం ఆలయం వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మార్చి 30న ఆరంభమైన ఉత్సవాలు ఆదివారంతో పూర్తయ్యాయి. సోమవారం కొత్త అమావాస్య ప్రధాన జాతర జరపనున్నట్లు ఆలయ ఈవో నగేష్ తెలిపారు.

ఎమ్మెల్సీ అనంతబాబుపై కేసు నమోదు చేయాలి

'విదసం' ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 7: గిరిజన యువకులపై దాడి చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ రద్దు చేయాలని విదసం ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో జైలుకువెళ్లి బెయిల్‌పై ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబు ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. తిరిగి ఎస్సీ, ఎస్టీలపై దాడులకు దిగడం బెయిల్ నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ స్థితిలో అనంతబాబు బెయిల్ రద్దు చేసి ఆయన ఎన్నికల ప్రచారంపై నిషేధం విధించాలని రాష్ట్ర సమన్వయకర్త డా.బూసి వెంకటరావు కోరారు. రంప చోడవరం నియోజకవర్గం పరిధి కూనవరం మండలం కుటూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అనంతబాబును గిరిజనుల సమస్యలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు, జీవో 3 అమలు, అటవీ సంరక్షణ బిల్లుపై వైసీపీ వైఖరి చెప్పాలని కోరిన గిరిజన యువకులపై దాడి చేసిన విషయం వీడియో వైరల్ అయ్యిందన్నారు. అనంతబాబు తన అనుచరులు, గన్‌మేన్‌లను ఉసిగొల్పి దాడికి పాల్పడ్డారన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీపై పోలీస్, ఎలక్షన్ కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

9నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

మాధవధార, ఏప్రిల్ 7: గ్రేటర్ 50వవార్డు గౌరీ రామలింగేశ్వరాలయంలో ఈనెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ టి.ఎస్.రెడ్డి తెలిపారు. ఉగాది రోజు మంగళవారం కలశ స్థాపనతో ఈ ఉత్సవాలు ఆరంభం కానున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఉత్సవ వివరాల పోస్టరు ఆవిష్కరించారు. 17వ తేదీన నవరాత్రి ఉత్సవాల ముగింపు రోజున సీతారాముల కల్యాణం వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ కార్యదర్శి సనపల.వరప్రసాద్, కమిటీ సభ్యులు ఉన్నారు.

పరమత సహనమే.. శాంతికి మూలం



మాట్లాడుతున్న మోహన్‌దాస్

సీతమ్మధార, ఏప్రిల్ 7 : పరమత సహనం కలిగి ఉండడం శాంతికి పునాది అని నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ వి.బాలమోహన్ దాస్ అని అన్నారు.ముస్లింలు పవిత్రం గా భావించే రంజాన్ మాసం సందర్భాన్ని పురస్కరించుకొని బీవీ ఫౌండేషన్ ఫర్‌పీస్, హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్‌బీ కాలేజీలోని గాంధీ సెంటర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలమోహన్ దాస్ మాట్లాడుతూ మతం ఒక నమ్మకమన్నారు. ఈ స్థితిలో అంతా సమభావనతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు, హుస్సేన్, అహ్మద్, ఖాసీం, రజనీకాంత్, బాబూరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మానవ మనుగడకు ప్రకృతి వ్యవసాయమే ఆధారం

- ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం సమావేశంలో నిపుణులు

విశాలాక్షినగర్, ఏప్రిల్ 7 : మానవ మనుగడకు ప్రకృతి వ్యవసాయమే ఆధారమని కళాభారతి అధ్యక్షుడు ఎంఎస్‌ఎన్‌రాజు అన్నారు. విశాలాక్షినగర్‌లోని బీవీకే కళాశాల ఆవరణలో ఆదివారం ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి రైతుల ఉగాది పురస్కార సమావేశంలో ఆయన మాట్లాడారు. రసాయన రహిత పంటల పెంపకం, వినియోగానికి ప్రజలు అలవాటు పడాలని పిలుపునిచ్చారు. రసాయనాలు, కృత్రిమ వ్యవసాయ విధానాలు రోగాలకు కారణమవుతున్నాయని తెలిపారు. అనంతరం పశుపోషణ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న, పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్న విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత సురపునేని విజయ్‌కుమార్, ఆదర్శ రైతు కొంగర రమేష్, పాత విత్తనాల పరిరక్షకుడు పచారి దేవుళ్లు, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే జట్టు సంస్థ అధినేత పారినాయుడును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సీ మాధవ్, బీవీకే కళాశాల విశ్రాంత అధ్యాపకుడు సత్యారావు, భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ నేత జలగం కుమారస్వామి, రైతు శాస్త్రవేత్త అశోక్‌కుమార్, ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘచాలక్ నారాయణరావు, పీఎల్‌ఎన్‌రాజు, సంఘం కార్యదర్శి అశోక్, సహాయ కార్యదర్శి రుషి, ఆకుల చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

జనసేనానికి నీరాజనం

... 3వ పేజీ తరువాయి

వెలిగించి పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలికారు. సత్యనారాయణ థియేటర్ వద్ద ఒక చంటి బిడ్డను పవన్‌కల్యాణ్ ముద్దాడారు. ఈ ర్యాలీలో మార్గమధ్యంలోని కుంచావారి గౌరీ పరమేశ్వరులు, వేల్పులవీధి గౌరీ పరమేశ్వరులను వాహనం పైనుంచే దర్శించుకున్నారు. ర్యాలీ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు దారి పొడవునా బందోబస్తు నిర్వహించారు.

కొండెక్కిన థీమ్‌పార్క్

... 3వ పేజీ తరువాయి

నగరానికి వచ్చే పర్యాటకులను సైతం ఆకర్షించవచ్చునని జీవీఎంసీ అధికారులు గుర్తించారు. ఇందులోభాగంగా గత ప్రభుత్వ హయాంలోనే జీవీఎంసీ కమిషనర్ ప్రతిపాదనలు పంపించారు. ఇంతలోనే ఎన్నికలు జరగడం, వైసీపీ అధికారంలోకి రావడంతో పార్కు అభివృద్ధి ప్రతిపాదనలు అటకెక్కిపోయాయి. ఆ తరువాత అప్పటి వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా వ్యవహరించిన విజయసాయిరెడ్డితో పాటు వైసీపీ పెద్దల కళ్లు ముడసర్లోవ పార్కుపై పడ్డాయి. పార్కుని పీపీపీ పద్ధతిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. పార్కుతోపాటు రిజర్వాయర్ భూములను విజయసాయిరెడ్డి, కొందరు వైసీపీ పెద్దలు కొందరు జీవీఎంసీ అధికారులతో సహా పరిశీలించారు. పార్కులో చిన్నపిల్లలకు ఆటవస్తువుల ఏర్పాటు, వాకింగ్‌ట్రాక్‌లు, రిక్రియేషన్ సెంటర్‌లు, ఫుడ్‌కోర్ట్‌లు, అడ్వెంచర్ స్పోర్ట్స్ సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. ముడసర్లోవ రిజర్వాయర్‌లో బోటింగ్ సదుపాయం, కంబాల కొండ వరకూ వెళ్లి వచ్చేలా రోప్‌వే ఏర్పాటు ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చే పర్యాటకులను ఆకర్షించవచ్చని భావించారు. తద్వారా ఆదాయాన్ని కూడా పెంచుకోవచ్చునని వైసీపీ నేతలు గొప్పలు చెప్పారు. ఇందుకోసం అవసరమయ్యే మొత్తాన్ని అంచనా వేసి ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. దీంతో మూడేళ్ల కిందట రూ.120 కోట్లతో ముడసర్లోవ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారుచేసి పంపించారు. అయితే ముడసర్లోవ భూములను కొల్లగొట్టేందుకు ప్రణాళిక సిద్ధమవుతోందనే విమర్శల నేపథ్యంలో విజయసాయిరెడ్డి వెనక్కి తగ్గారని, ఫలితంగా ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేయలేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

జీవీఎంసీ నిధులతో పనులకు యత్నం

పార్కు అభివృద్ధికి అడుగులు పడకపోవడంతో నగర వాసుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇవి పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తాయని గుర్తించిన వైసీపీ నేతలు జీవీఎంసీ నిధులతో పార్కు అభివృద్ధి చేసినట్టు కలరింగ్ ఇవ్వాలని భావించారు. ఇందులో భాగంగా జీవీఎంసీ పాలకవర్గంలోని వైసీపీ పెద్దల సూచన మేరకు అధికారులు ఇటీవల రూ.30 లక్షలు జీవీఎంసీ నిధులు వెచ్చించి చిన్నపిల్లల ఆటవస్తువుల ఏర్పాటు, సివిల్‌వర్కుల రిపేర్ల కోసం ప్రతిపాదనలను గత నెలలో జరిగిన చివరి స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించారు. ఎన్నికల్లో నష్టం జరుగుతుందనే భయంతోనే ముడసర్లోవ పార్కులో చిన్న పిల్లల ఆటవస్తువులను మొక్కుబడిగా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రజలను మభ్యపెట్టడం మినహా, ఇంతవరకూ పనులు ప్రారంభించలేదని నగరవాసులు దుమ్మెత్తిపోస్తున్నారు.

ఆరోగ్యశ్రీ బిల్లులకు మోక్షమేదీ?

... 3వ పేజీ తరువాయి

పోయిందని, వైద్య సేవలు నిలిపివేస్తే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటారనే ఉద్దేశంతోనే కొనసాగిస్తున్నామంటున్నాయి.

రోగులకు తప్పని ఇబ్బందులు

నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం బిల్లులను పెండింగ్‌లో పెట్టడంతో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనేక చోట్ల వైద్యసేవలు అందించేందుకు ఆస్పత్రులు ముందుకు రావడంలేదు. అనారోగ్యంతో వస్తే ఆ సమస్య ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో లేదని చెప్పేస్తున్నారు. దీంతో రోగులు ఆస్పత్రుల చుట్టూ తిరగలేక, అప్పు చేసి అదే వైద్యసేవలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ఆస్పత్రులు అయితే కొత్తగా చేరే రోగులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తించదని తేల్చేస్తున్నారు. ఇది మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తోంది.

యాజమాన్యాలపై భారం

నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందే రోగుల్లో సుమారు 80 నుంచి 90 శాతం మంది ఆరోగ్యశ్రీ పథకానికి చెందిన రోగులే ఉంటున్నారు. మిగిలిన వారంతా పేమెంట్, ఇతర స్కీమ్స్‌లో వైద్యసేవలు పొందుతుంటారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తే సిబ్బందికి వేతనాల చెల్లింపు, ఆస్పత్రుల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు రావని, పెండింగ్‌లో పెట్టేయడంతో అప్పులు చేయాల్సి వస్తోందని యాజ మాన్య ప్రతినిధులు వాపోతున్నారు. ఇప్పటికైనా సకాలంలో బిల్లులు చెల్లిస్తే మెరుగైన వైద్యసేవలు అందుతాయని పలువురు రోగులు పేర్కొంటున్నారు.

ఉలిక్కిపడిన ఫార్మా సిటీ

... 3వ పేజీ తరువాయి

ఆళ్ల గోవింద(32) డ్రయర్ రూము బోల్టు బిగించే క్రమంలో ఒక్కసారిగా డోర్ తెరుచుకుంది. దీంతో లోపల ఉన్న మిథైల్ నైట్రేట్ గ్యాస్ ఒక్కసారిగా రావడంతో పీల్చి కుప్పకూలిపోయాడు. ఈ క్రమంలో డ్రయర్ రూము డోర్ ఓపెన్ అయి శబ్దం రావడంతో సమీపంలో ఉన్న కిటికీ గ్లాస్ పగిలి అక్కడే పనిచేస్తున్న సూపర్‌వైజర్ బి.నరేంద్ర కంటికి తగలడంతో గాయమైంది. అలాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.బాబ్జీ, మరో ఫిట్టర్ బి. గోవింద స్వల్పగాయాలతో బయటపడ్డారు. కాగా కుప్పకూలిన గోవిందను తొలుత అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతుని స్వస్థలం పాలకొండ. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ బాలసూర్యారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమలను సందర్శించిన అధికారులు

ప్రమాదం విషయం తెలుసుకున్న ఆర్డీవో చిన్నికృష్ణ, పరిశ్రమల అధికారి చిన్నారావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శాంతిభూషణ్, సీఐ బాలసూర్యారావు ప్రమాదాలు జరిగిన పరిశ్రమలను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను యాజమాన్యాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందజేయాలని యాజమాన్యాలకు సూచించారు.

ఆరోగ్యవంతమైన సమాజం అవసరం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 7: ఆరోగ్యవంతమైన సమాజం అవసరమని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పీఏవీ, పీపీసీ ఆధ్వర్యంలో 'నా ఆరోగ్యం నా హక్కు' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ చట్ట ప్రకారం ఆర్టికల్ 21 ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని చెబుతుందన్నారు. డా.పి. రామారావు మాట్లాడుతూ, ప్రభుత్వాలు ఆరోగ్య రంగాన్ని పన్నుల ద్వారా ఆదాయవనరుగా చూడడం అన్యా యమన్నారు. డా.రాజు మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరూ శ్రద్ధ చూపాలన్నారు.కార్యక్రమానికి ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు వీవీ సుధాకర్ అధ్యక్షతవహించగా రాష్ట్ర నాయకులు కేవీపీ చంద్రమౌళి పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో వాక్‌థాన్

మహారాణిపేట, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం బీచ్‌రోడ్డులోని లీ హెల్త్ సంస్థ ఆధ్వర్యంలో వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఈ వాక్‌థాన్‌ను సంస్థ చైర్మన్ ప్రవీణ్ రెడ్డి, డైరెక్టర్ ఆళ్ల లీలారాణి ప్రారం భిం చారు. అనంతరం యోగా విలేజ్ వద్ద ఎముకలు, కీళ్ల వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వ హించారు.



బీచ్‌రోడ్డు వాక్‌థాన్‌లో ప్రతినిధులు

మురళీనగర్; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు హాజరై స్థానికులకు ఆరోగ్య సమస్యలపై సందేహాలను నివృత్తి చేశారు. మురళీనగర్, మాధవధార ప్రాంత వాసులు హాజరైన ఈ కార్యక్రమంలోక్లబ్ అధ్యక్షులుపల్లా.చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్వరా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

ప్రజల ఆకాంక్షలకు తూట్లు పొడుస్తున్న ప్రభుత్వాలు

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 7: ప్రజల ఆకాంక్షలకు తూట్లు పొడుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పతనం తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,151వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాల బాటలో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను తమ స్వప్రయోజనాల కోసం నష్టాల్లోకి నెట్టిన వారెవరైనా చరిత్రహీనులుగా మిగులుతారన్నారు. సీపీఎం నాయకుడు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు పోరాటాలను మరింత తీవ్రతరం చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులంతా ఏకతాటిపైకి వచ్చి ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా చూడాలని కోరారు. పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన పరిశ్రమలను తీసుకువచ్చామని ఊదరగొడుతున్న మంత్రులను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెనక్కి తీసుకునేంత వరకు తాము పోరాటాలను ఆపేదే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

చదువు పట్ల ఆసక్తిని కలిగించాలి

పెదగంట్యాడ, ఏప్రిల్ 7: చదువు పట్ల పిల్లలకు ఆసక్తిని కలిగించాలని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీపీ రమణ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదువంటే మాకిష్టం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తరగతి పుస్తకాలతో పాటు సామాజిక అంశాలు కలిగిన పుస్తకాలు, కథల పుస్తకాలను చిన్నారులతో చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో నడుపూరు జెడ్పీ హైస్కూల్, నెల్లిముక్కు మోడల్ యూపీ స్కూల్ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, ఏప్రిల్ 7: వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చనను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో సుగంధభరిత పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠించి స్వర్ణ సంపెంగలతో పూజలు చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహించారు.

సినిమా గైడ్

- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, శారద, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-1, హెవెన్, లక్ష్మీకాంత్ (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 28, బీరకాయలు 36, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారేట్ 26, దొండకాయలు 18, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది) 155, బరబటి 22, ముల్లంగి 16,నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 28, దోస కాయలు 12, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 22,బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 52, పొటల్స్ 50, కీరదోస 22, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	405
విజయనగరం	409
శ్రీకాకుళం	409

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	130
ఫారం ధర	--	150
విత్ స్కిన్	--	270
స్కిన్‌లెస్	--	280

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ IIIలో..

అంతరించిపోతున్న సర్కారీ స్థలం!

గోపాలపట్నం శ్మశానవాటిక కూడలి సమీపాన పెరుగుతున్న ఆక్రమణలు

సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తయితే రాకపోకలకు ఇబ్బంది కలిగే అవకాశం

గోపాలపట్నం, ఏప్రిల్ 7: గోపాలపట్నం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న శ్మశానవాటిక కూడలి వద్ద సందరం అప్పలనాయుడు మార్గానికి వెళ్లే రహదారిలో గల ప్రభుత్వ స్థలం ఆక్రమణలతో అంతరించిపోతుంది. గోపాలపట్నం ప్రధాన రహదారిలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి పదేళ్ల క్రితం శ్మశానవాటిక కూడలి నుంచి సింహాచలం రైల్వేస్టేషన్ కూడలి మీదుగా కొత్తపాలెం పరిసర ప్రాంతాలకు వెళ్లడానికి బైపాస్ రోడ్డును నిర్మించారు. ఈ రహదారికి సదరం అప్పలనాయుడు మార్గమని నామకరణం చేశారు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల గోపాలపట్నం దిగువ ప్రాంతాలకు చెందిన వాహనచోదకులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. దీనివల్ల ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ చాలావరకు తగ్గిందనే చెప్పాలి. కాగా శ్మశానవాటిక కూడలిలో సందరం అప్పలనాయుడు మార్గానికి వెళ్లే ప్రధాన ప్రవేశం వద్ద కొంత ప్రభుత్వ భూమి ఉంది. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఈ ప్రభుత్వ భూమిని పూర్తిగా రహదారిగా మార్చి బీఆర్‌టీఎస్‌కు రహదారికి కలిపితే శ్మశానవాటిక కూడలి చాలా సువిశాలంగా మారుతుంది.

అయితే దీనిపై అధికారులు పెద్దగా దృష్టి సారించకపోవడంతో ఈ స్థలంపై ఆక్రమణదారుల కన్ను పడింది. ఇప్పటికే నాలుగు దుకాణాలను ఏర్పాటు చేసి ఆక్రమణలకు తెరలేపారు. త్వరలో మరిన్ని దుకాణాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న రూ.లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గోపాలపట్నం బంక్ కూడలిలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో గతంలో ఆక్రమణల వల్ల ఏర్పడిన దుకాణాలను అధికారులు ఇప్పటికీ తొలగించలేకపోతున్నారు. ఈ తరుణంలో శ్మశానవాటిక వద్ద సర్కారు స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించకపోతే భవిష్యత్తులో రహదారి విస్తరణ చేయడం కష్టతరంగా మారే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.



గోపాలపట్నం శ్మశానవాటిక కూడలిలో సదరం అప్పలనాయుడు మార్గంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

ఇదే ప్రధాన కూడలిగా మారే అవకాశం

ప్రస్తుతం సింహాచలం రైల్వే స్టేషన్‌ను సుమారు ఇరవై కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారు. స్టేషన్ నుంచి వాహనాలు నేరుగా బీఆర్‌టీఎస్ రహదారికి చేరుకునే విధంగా స్టేషన్ లోపల నుంచి సందరం అప్పలనాయుడు మార్గం మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డుకు కనెక్టింగ్ చేయనున్నారు. ఈ తరుణంలో శ్మశానవాటిక కూడలి త్వరలో గోపాలపట్నంలో మో ప్రధాన కూడలిగా మారనున్నది. ఈ క్రమంలో శ్మశానవాటిక కూడలిని త్వరలో విస్తరించాల్సిన అవసరం ఉంది. అయితే శ్మశానవాటిక కూడలిలో ఉన్న ఆక్రమణల వల్ల రోడ్డు విస్తరణకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఎలాంటి ఇబ్బందులు కలగక ముందే శ్మశానవాటిక కూడలిలోని ఆక్రమణలను తొలగించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్



వైసీపీలో చేరిన వారితో ఆనంద్‌కుమార్

వైసీపీ హయాంలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

పశ్చిమ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం, ఏప్రిల్ 7: వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేయడం జరిగిందని పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 60వ వార్డు పరిధి శ్రీహరిపురంలోని రెండు గుళ్ల వద్ద పార్టీ నాయకుడు అంగ రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సుమారు మూడు వందల మంది వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల తర్వాత తెలుగుదేశం పార్టీ కనుమరగవ్వడం ఖాయమన్నారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి ప్రజారంజక పాలనను అందిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీకి ఆదరణ రెట్టింపు అవుతుందని, అందుకే రోజురోజుకు జనాలు వైసీపీలో చేరుతున్నారన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగు తుందన్నారు. తాను వైసీపీ 'పశ్చిమ' సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టాక నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టానని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. పలు కారణాలతో పింఛన్లు అందని వారికి ప్రతినెలా సొంత నిధులతో పెన్షన్లు అందిస్తున్నానని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో తనతో పాటు ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



ఆదివారం రాత్రి అమ్మవారి ప్రతిమలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



ఉత్సవాలకు ముస్తాబైన గోపాలపట్నంలోని నూకాంబిక అమ్మవారి ఆలయం

వైభవంగా నూకాంబిక తొలేళ్ల ఉత్సవం

గోపాలపట్నంలో అమ్మవారి ప్రతిమలతో భక్తుల ఊరేగింపు

గోపాలపట్నం, ఏప్రిల్ 7: గోపాలపట్నంలో నూకాంబిక అమ్మవారి తొలేళ్ల ఉత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటల నుంచే పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్దసంఖ్యలో అమ్మవారి ఆలయ సమీపంలోని సదరం పట్టు వద్దకు నూకాంబిక ఉత్సవ ప్రతిమలతో ఊరేగింపుగా విచ్చేశారు. రాత్రి తొమ్మిది వరకు సదరం పట్టు వద్ద అమ్మవారి ప్రతిమలకు పూజలు చేశాక వాటితో పాటు ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. గారడీల విన్యాసం, తప్పెటగుళ్ళు, కోలాటం, పులివేషాలు, తదితర సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఊరేగింపు సందడిగా సాగింది. కాగా ఆదివారం అర్ధరాత్రి దాటాక అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తారు. సోమవారం ప్రధాన పండుగ దష్ట్యా వేకువజాము నుంచే అమ్మవారి దర్శనాలకు వందలాది మంది భక్తులు తరలివస్తారు కాబట్టి వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు తగిన చర్యలు చేపట్టారు. భక్తులు క్యూ లైన్లలో నిల్చొనేందుకు వీలుగా బారికేడ్లు, పెండాల్స్ ఏర్పాటు చేశారు.

చింతల అగ్రహారంలో..

పెందుర్తి-రూరల్: మండలంలోని చింతలఅగ్రహారంలో రెండు రోజులపాటు జరిగే నూకాంబిక ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారికి వసంతోత్సవం నిర్వహించారు. మహిళలు ఘటాలలో వసంతాలు నింపి వేపకొమ్మలతో స్థానిక గీతాకృష్ణ మందిరం నుంచి ఊరేగింపుగా బయలుదేరి భూలోకమాత, వీరాంజనేయ స్వామి ఆలయాల మీదగా నూకాంబిక ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి వసంతోత్సవం నిర్వహించారు. సర్పంచ్ దాడి గోపీఅప్పలనాయుడు, మాజీ సర్పంచులు పి.వెంకటరమణ, ఆళ్ల తాతారావు, ఎం.శ్రీనివాసరావు, కమిటీ సభ్యురాలు వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు అశోక్‌నగర్ కాలనీలో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్ కాలనీలోని నూకాంబిక అమ్మవారికి కొత్త అమావాస్యను పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు జరగనున్నాయి. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టారు.

94వ వార్డులో..

వేపగుంట: గ్రేటర్ 94వ వార్డు పరిధి కృష్ణానగర్‌లో సోమవారం నూతనంగా ప్రతిష్ఠించనున్న నూకాంబిక అమ్మవారికి పుట్ట బంగారం, పసుపుకుంకుమలు సమర్పించనున్నారు. గంగిరెడ్డి కాలనీలోని నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టనున్నారు. అలాగే 93వ వార్డు ప్రహ్లాదపురంలోని నూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేయనున్నారు.

టీడీపీ విజయం తథ్యం: 'పశ్చిమ' అభ్యర్థి గణబాబు



బుచ్చిరాజుపాలెంలో ప్రచారంలో గణబాబు

మల్కాపురం, ఏప్రిల్ 7: తెలుగుదేశం పార్టీలో రోజురోజుకు పెరుగుతున్న చేరికలను చూస్తుంటే తమ విజయం తథ్యమనిపిస్తుందని పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పి.గణబాబు అన్నారు. 59వ వార్డు హిమాచల్‌నగర్‌లోని ఏడు వార్డుల టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సుమారు మూడు వందల మంది ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్ నాయుడు, కె.పోలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరాజుపాలెంలో..

ఎన్.ఎ.డి. జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెంలో టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పి.గణబాబు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ముందుగా ఆయనకు టీడీపీ, బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన బుచ్చిరాజుపాలెం మెయిన్ రోడ్డు, గవరవీధి, గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, నాయకులు మళ్ల అప్పారావు, వై.ప్రసాద్, పైడిరాజు, దాడి వెంకటరమేశ్, వి.శ్రీనివాస్, జగన్, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పుచ్చకాయల విక్రయాలు



గాజువాక, ఏప్రిల్ 7: వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పుచ్చకాయల విక్రయాలు కూడా జోరందుకున్నాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పుచ్చకాయలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి కాబట్టి వీటిని కొనుగోలు చేసేందుకు అత్యధికులు ఆసక్తి చూపుతారు. దీంతో వీటిని గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కడ పడితే అక్కడ అమ్ముతున్నారు. ప్రస్తుతం వీటి అమ్మకాలు ఆశాజనకంగా సాగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.



ఎక్స్‌కవేటర్ సాయంతో మురుగు నీరు దిగువ ప్రాంతానికి పారేలా చేస్తున్న సిబ్బంది

మురుగు కాలువ సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆటోనగర్, ఏప్రిల్ 7: జీవీఎంసీ 70వ వార్డు పరిధి టీవీఎస్ కాలనీని ఆనుకుని ఉన్న మురుగు కాలువ సమస్య దశాబ్దాల తరబడి పరిష్కారానికి నోచుకోకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, తదితరులు ఇక్కడకు వచ్చి ప్రైవేటు స్థల యజమానితో మాట్లాడి మురుగు కాలువ సమస్యను పరిష్కరించారు. శానిటరీ సూపర్‌వైజర్ రామారావు ఎక్స్‌కవేటర్‌తో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న గోడను తొలగించారు.

వన్య ప్రాణుల సంరక్షణ పట్ల అవగాహన

విశాఖపట్నం, ఏప్రిల్ 7: వన్య ప్రాణుల సంరక్షణ పట్ల చిన్నారులకు అవగాహన అవసరమని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా అన్నారు. ఆదివారం జూపార్కులో జాతీయ జంతు ప్రేమికుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడూతూ వన్య ప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. అనంతరం చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సదరన్ గ్రూప్ సీఎండీ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కాగా ఆదివారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల (జూ పార్కు)కు సందర్శకుల తాకిడి పెరిగింది. మొత్తం 1,670 మంది పర్యాటకులు జూను సందర్శించడం వల్ల రూ.1.47 లక్షల ఆదాయం సమకూరినట్టు నందనీ సలారీయా పేర్కొన్నారు.



వేదికపై శ్రీభరత్, దువ్వారపు రామారావు, పల్లా శ్రీనివాసరావు, తదితరులు

వైసీపీకి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం

టీడీపీ విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి ఎం.శ్రీభరత్

గాజువాక, ఏప్రిల్ 7: రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని టీడీపీ విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి ఎం.శ్రీభరత్ అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో ఆదివారం గాజువాక శిష్టకరణ సాధికార సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా శ్రమించి కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. గాజువాక కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్షేమ పాలన రావాలంటే కూటమి అభ్యర్థుల గెలుపు ఆవశ్యకమన్నారు. ఏపీ శిష్టకరణ సాధికార సమితి కన్వీనర్ అక్కుమహంతి రాజా మాట్లాడుతూ శిష్టకరణాలను ఓబీసీలో చేర్చుందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.విజయ్‌కుమార్, బలివాడ సత్యారావు, బి.తిరుపతిరావు, ప్రతాపరావు చిన్నమోహన్, గౌరీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే ప్రధాన ధ్యేయం: 'పల్లా'

ఆటోనగర్, ఏప్రిల్ 7: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే తన ప్రధాన ధ్యేయమని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. 70వ వార్డు పరిధిలోని ఎల్‌వీనగర్‌లో ఆదివారం జనసేన నాయకుడు కేవీ సూరిబాబు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి కలయికతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డేడ రమణ, లంకల మురళీదేవి, ఆడారి రామకృష్ణ, టి.చిరంజీవి, జి.వెంకటరావు, ఎంఎస్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లో వృథాగా పోతున్న తాగునీరు



వృథాగా పోతున్న తాగునీరు

పెదగంట్యాడ, ఏప్రిల్ 7: జీవీఎంసీ 65వ వార్డు పరిధి మూడో లైన్‌లో తాగునీరు వృథాగా పోతుంది. కొళాయిల ద్వారా కాలనీవాసులకు తాగునీటిని అందించే అండర్ గ్రౌండ్ పైపు లైన్ లీకవ్వడం వల్ల అధిక మొత్తంలో నీరు రహదారిపై పారుతు మురుగు కాలువలో కలిసిపోతుంది. దీంతో ఈ వీధిలోని ప్రజలకు కొళాయిల ద్వారా తాగునీరు పూర్తి స్థాయిలో సరఫరా కావడంలేదు. నెల రోజులుగా ఇక్కడ నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపు లైన్‌లకు లీకేజీలను అరికట్టి తమకు తాగునీటిని అందించాలని మహిళలు జీవీఎంసీ తాగునీటి సరఫరా అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. కొళాయిల ద్వారా నీరు సక్రమంగా రాకపోవడంతో తామంగా బోరింగ్‌లపై ఆధారపడాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపు లైన్‌లకు మరమ్మతులు చేపట్టి లీకేజీలు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

జనసేన పార్టీలో చేరిన వైసీపీ కార్యకర్తలు



జనసేనలో చేరిన వారితో పంచకర్ల, తదితరులు

అగనంపూడి, ఏప్రిల్ 7: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెల పాలేనికి చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్, వైసీపీ నాయకుడు దాసరి తాతారావు, మాజీ ఉప సర్పంచ్ కర్రి అప్పారావుతో పాటు సుమారు వంది మంది కార్యకర్తలు వైసీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ కూటమి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి విజయానికి శక్తివంచన లేకుండా తాము కృషి చేస్తామన్నారు. అనంతరం రమేశ్‌బాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి, దోపిడీలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దుల్ల రామునాయుడు, సర్వసిద్ధి సన్యాసిరాజు, కె.నరసింగరావు, బి.గోవింద్, ఎం.వెంకటరమణ, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో పంచకర్ల ప్రచారం

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గ కూటమి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు సుజాతనగర్‌లో ప్రచారం చేశారు. ఉదయం 80 అడుగుల రోడ్డులో వాకర్స్‌ను కలిసి తనను గెలిపించాలని కోరారు. అరాచక పాలన సాగిస్తున్న వైసీపీకి బుద్ధి చెప్పాలన్నారు. ఆయన వెంట నాయకులు సేనాపతి శంకరరావు, అయితసింహాచలం ఉన్నారు.

'కాంగ్రెస్, వామపక్షాల అభ్యర్థులను గెలిపించుకోవాలి'

పెదగంట్యాడ, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం అభ్యర్థులను గెలిపించుకోవాలని ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కొవిరి దేవుడు కోరారు. స్థానిక ఫిషర్‌మెన్ కాంగ్రెస్ ఆదివారం గంగవరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల అధికారాన్ని వెలగబెట్టిన వైసీపీతో, ప్రతిపక్షంలో ఉన్న కూటమి వల్ల ప్రజలకు ఎటువంటి ఉపకారం ఉండదన్నారు. అందువల్ల పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలోని కాంగ్రెస్‌ను ప్రజలు అభిమానిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి పి.అప్పలరాజు, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ నాయకులు అంగ పైడిరాజు, ఎ.నూకరాజు, కె.రాజన్న, దేవుడు జి.నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 7: స్టీల్‌ప్లాంట్‌లో గల పురాతన శివాలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలతో పాటు రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఉక్కు కర్మాగారానికి అంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ పలువురు పూజలు జరిపారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమరాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు యేల్లేటి శ్రీనివాసరావు, రమేశ్‌కుమార్, ప్రసాద్, కాంతారావు, రామచంద్రరావు, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

కేటాయించిన స్థలంలోనే వాహనాలను పార్కింగ్ చేయాలి

ఆటోనగర్, ఏప్రిల్ 7: ఆటోనగర్ ప్రధాన రహదారుల్లో భారీ వాహనాలను పార్కింగ్ చేసి ఇతర వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న, పలు ప్రమాదాలకు కారణమవుతున్న అంశంపై 'ఆంధ్రజ్యోతి'లో 'అనధికార పార్కింగ్‌తో అవస్థలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఐలా అధికారులు స్పందించారు. ఐలా కమిషనర్ కె.జయచంద్ర ఆదేశాల మేరకు పార్కింగ్ గుత్తేదారు, ఐలా సిబ్బంది ఆటోనగర్‌లోని పలు కూడళ్లను సందర్శించారు. ఆయా రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనదారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. భారీ వాహనాలను కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలని ఆదేశించారు. ఇకపై ఇషారాజ్యంగా పార్కింగ్ చేసినట్టు తమ తనిఖీల్లో తేలితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

రైతుబజారు రోడ్డులో ట్రాఫిక్ సమస్య

నరసింహనగర్ రోడ్డుపై తోపుడు బండ్లు, దుకాణాల ఏర్పాటుతో అవస్థలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 7: గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారు వద్ద రోడ్డులోదుకాణాలు, తోపుడు ఆక్రమణతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికితోడు వ్యాపారుల మధ్య పోటీతో నిత్యం వాగ్వాదాలు, ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. సెలవురోజైన ఆదివారం ఉదయం, సాయత్రం వేళల్లో నానా రభస జరుగుతోంది.ఎవరికి తోచిన రీతిలో వారు ప్రవర్తిస్తూ ఆ మార్గంలో వెళ్లే ఇతరుల సమస్యలను పట్టించుకునే పరిస్థితి ఉండదు. వివిధ ప్రాంతాల నుంచి రైతుబజారుకు నిత్యం పెద్ద సంఖ్యలో వినియోగదారులు విచ్చేస్తుంటారు. బజారు లోన పార్కింగ్ స్థలం ఉన్నా కొందరు వినియోగదారులు దాన్ని పట్టించుకోకుండా ప్రాంగణంలో వాహనాలను నిలిపి వెళ్లిపోతుంటారు. అలాగే, తోపుడు బండ్ల వ్యాపారులు ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డును సగం వరకు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుంటారు. దీంతో రాకపోకలు జరిపేవారే కాకుండా వినియోగదారులూ తమ వాహనాలను బయటకు తీసేందుకు నానాపాట్లు పడాల్సిందే. అసలే ఇరుకు రోడ్డు దీనికి తోడు సగానికిపైగా ఆక్రమించడంతో నిరంతరం సమస్య నెలకొంటోంది. కొన్నిసార్లు గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారుల సహనానికి పరీక్షగా మారుతోంది. ట్రాఫిక్ పోలీసుల, అధికారులు ఎన్ని చర్యలు చర్యలు తీసుకున్నా కాసేపటికే మళ్లీ వీరంతా తమ పని తాము చేసుకుపోతుండడంతో సమస్య తప్పడం లేదు.


నరసింహనగర్ రోడ్డుపై తోపుడు బళ్లు, పార్కింగ్ చేసిన వాహనాలు

తప్పించుకు వెళ్లాలంటే కష్టం


రైతుబజారు ఎదురుగా రహదారిని సగానికి పైగా ఆక్రమించి వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. రైతుబజారుకు వెళ్లాలంటే ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. రోడ్డుకిరువైపులా వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల వాటిని తప్పించుకుని బజారులోనికి వెళ్లలేకపోతున్నాం. అధికారులు చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలి.

-వాసు, వినియోగదారుడు

కంచరపాలెంలోనూ అదే దుస్థితి

కంచరపాలెం,ఏప్రిల్ 7: కంచరపాలెం రైతుబజారు వద్ద తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల ఆక్రమణలతో వినియోగదారులు లోనికి వెళ్లడానికి అవస్థలు పడాల్సి వస్తోంది. రైతుబజారు ప్రధాన ద్వారానికి ఇరువైపులా దుకాణాలు ఇష్టానుసారంగా వ్యాపారాలు చేస్తున్నారు. దీనికితోడు అక్కడే ఆటోలు నిలిపడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బజారు ప్రారంభంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉండడంతో వృద్ధులు, మహిళలు బజారులోకి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ట్రాఫిక్ సిబ్బంది నియం త్రణ చర్యలు తూతూ మంత్రంగా వ్యవహరిస్తుండడంతో సమస్య మరింత జటిలమవుతోంది. అసలే ఇరుకైన సర్వీస్ రోడ్డులో వాహనాలు ఇరువైపులా నుంచి వస్తుంటాయి. రోడ్డును ఆక్రమించడంతో బజారు వద్ద వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.ఇప్పటికైనా ట్రాఫిక్,జీవీఎంసీ సిబ్బంది దృష్టిని సారించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.


కంచరపాలెం రైతు బజారు ఎదుట తోపుడుబళ్లు, దుకాణాలతో రద్దీ

మార్పు రావాలి... కూటమి అభ్యర్థులు గెలవాలి

» టీడీపీ విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు గండిబాబ్జీ

మురళీనగర్, ఏప్రిల్ 7; ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతికి జనసేన, టీడీపీ, బీజేపీ మూడు పార్టీల విజయం సరికొత్త దారి చూపిస్తుందని టీడీపీ విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు గండిబాబ్జీ అన్నారు. ఆదివారం విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసనసభ ఉమ్మడి అభ్యర్థి పెన్మెత్స విష్ణుకుమార్ రాజు చేపట్టిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ 51వవార్డు అధ్యక్షులు సనపల.కీర్తి అధ్యక్షతన కూటమి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టేందుకు కూటమి నాయకులకు ప్రజలు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్, టీడీపీ స్టేట్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ జయరాజు, జనసేన పార్టీ 51వవార్డు అధ్యక్షులు జి.అప్పారావు తదితర నాయకులు ఉన్నారు.

మహారాణిపేట: తెలుగుదేశం పార్టీలోకి దక్షిణ నియోజకవర్గ పరిధి గ్రేటర్ 32వ వార్డుకు చెందిన 50 మంది చేరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గండిబాబ్జీ వీరందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, ఈ స్థితిలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. ఈ కారక్రమంలో నాయకులు పి. శ్రీనివాసరావు, దాసరి దుర్గారెడ్డి, పంపాన రాజ్యలక్ష్మి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గండిబాబ్జీ

కూటమి విజయాన్ని కాంక్షిస్తూ హనుమాన్‌కు పూజలు

టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి ఎం శ్రీ భరత్ సేవలు అవసరమని సాగునీటి వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ గోపాల కృష్ణారావు అన్నారు. కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తు హనుఎన్ జంక్షన్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి చిత్రపటం, కండువాను శ్రీభరత్ కు అందజేశారు.

'అంబికాబాగ్'లో శ్రీరామ నవమికి ఏర్పాట్లు

»17 న శ్రీ సీతారాముల కల్యాణం


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరెడ్డి, తదితరులు

మహారాణిపేట, ఏప్రిల్ 7: అంబికాబాగ్ శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఈ నెల 17న శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు, ఆదివారం మహారాణిపేటలోని ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రామ నవమి వసంత న వరాత్రుల వేడుకల్లో భాగంగా ఈనెల 9న శ్రీసీతారాముల కల్యాణ రాట, శ్రీ రాముడిని పెండ్లికుమారుని చేయడం, ఉగాది సందర్భంగా అదే రోజు పంచాంగం శ్రవణం ఉంటుందని వివరించారు. ఈనెల 10 నుంచి 16 వ తేదీ వరకు శ్రీ సీతారామ స్వామికి విశేష ఆరాధన విశేష హోమాలు తదితర వాటిని నిర్వహించనున్నట్లు తెలిపారు. 17 వ తేదీన చైత్ర శుద్ధ నవమి సందర్భంగా శ్రీరామ నవమి పర్వదినం పురస్కరించుకొని ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం, 10 గంటల నుంచి 12 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 18వ తేదీన శ్రీ రాముని పట్టాభిషేకం జరపనున్నట్టు చెప్పారు. ఉత్సవాలకు రూ. 10లక్షల అంచనాతో వ్యయం చేయనున్నట్టు వివరించారు. ఈ ఉత్సవాల్లో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతి కార్య క్రమాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధికారులు వి. రాంబాబు , కె. తిరుమలేశ్వరరావు , సీహెచ్ వెంకటేశ్వరరావు తది తరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

జగదాంబ కూ డలి, ఏప్రిల్ 7: ఎన్నికల్లో ఎటువంటి చట్టవ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడితే కఠిన చర్య లు తప్పవని వన్‌టౌన్ సీఐ భాస్కర్ రౌడీ షీటర్లనుహెచ్చరించారు. ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌటీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు క్రిమినల్ చర్యలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయపార్టీల మద్దతుగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రౌడీషీటర్ల ప్రతీ కదలికపై నిఘా ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సీతమ్మధార, ఏప్రిల్ 7 : నిర్వహణ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. గాంధీనగర్ ఏరియా, ఎంఆర్వో ఆఫీస్ ఏరియా, పోస్టాఫీసు ఏరియా, జేపేషన్ ఏరియాల్లో కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా నూకాంబిక మహోత్సవాలు


బర్మాక్యాంపులో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

మాధవధార, ఏప్రిల్ 7; గ్రేటర్ 49వ వార్డు బర్మాక్యాంపు శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో కొత్త అమావాస్య నవరాత్రి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలు, నూతన వస్త్ర ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు శూలాల ప్రదర్శనలతో అమ్మవారి సన్నిధికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కంచరపాలెం, ఊర్వశి జంక్షన్, మాధవధార, ఎన్‌జీజీఓస్ కాలనీ, కప్పరాడ కొండ ప్రాంతాల నుంచి వేలాది జనం కుటుంబాలతో అమ్మవారి దర్శనాలకు చేరుకున్నారు. ప్రత్యేక మందిర అలంకరణలో అమ్మవారిని ప్రతిష్ఠించిన తలపై పసుపు బిందెల నీళ్లతో వచ్చి ప్రదక్షిణ చేశారు. అర్చకులు చిట్టిబాబు శర్మ పర్యవేక్షణలో పూజలు జరిపారు. సాయంత్రం ఆలయం వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మార్చి 30న ఆరంభమైన ఉత్సవాలు ఆదివారంతో పూర్తయ్యాయి. సోమవారం కొత్త అమావాస్య ప్రధాన జాతర జరపనున్నట్లు ఆలయ ఈవో నగేష్ తెలిపారు.

ఎమ్మెల్సీ అనంతబాబుపై కేసు నమోదు చేయాలి

'విదసం' ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 7: గిరిజన యువకులపై దాడి చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ రద్దు చేయాలని విదసం ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో జైలుకువెళ్లి బెయిల్‌పై ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబు ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. తిరిగి ఎస్సీ, ఎస్టీలపై దాడులకు దిగడం బెయిల్ నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ స్థితిలో అనంతబాబు బెయిల్ రద్దు చేసి ఆయన ఎన్నికల ప్రచారంపై నిషేధం విధించాలని రాష్ట్ర సమన్వయకర్త డా.బూసి వెంకటరావు కోరారు. రంప చోడవరం నియోజకవర్గం పరిధి కూనవరం మండలం కూటూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అనంతబాబును గిరిజనుల సమస్యలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు, జీవో 3 అమలు, అటవీ సంరక్షణ బిల్లుపై వైసీపీ వైఖరి చెప్పాలని కోరిన గిరిజన యువకులపై దాడి చేసిన విషయం వీడియో వైరల్ అయ్యిందన్నారు. అనంతబాబు తన అనుచరులు, గన్‌మేన్‌లను ఉసిగొల్పి దాడికి పాల్పడ్డారన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీపై పోలీస్, ఎలక్షన్ కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

9నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

మాధవధార, ఏప్రిల్ 7: గ్రేటర్ 50వవార్డు గౌరీ రామలింగేశ్వరాలయంలో ఈనెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ టి.ఎస్.రెడ్డి తెలిపారు. ఉగాది రోజు మంగళవారం కలశ స్థాపనతో ఈ ఉత్సవాలు ఆరంభం కానున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఉత్సవ వివరాల పోస్టరు ఆవిష్కరించారు. 17వ తేదీన నవరాత్రి ఉత్సవాల ముగింపు రోజున సీతారాముల కల్యాణం వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ కార్యదర్శి సనపల.వరప్రసాద్, కమిటీ సభ్యులు ఉన్నారు.

రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తే సహించం: సీఐ



అవగాహన కల్పిస్తున్న సీఐ అమ్మినాయుడు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 7: రహదారులు ఆక్రమించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు తోపుడు బళ్ల వ్యాపారులను హెచ్చరించారు. అక్కయ్యపాలెం నుంచి దొండపర్తి వరకు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారితో ఆదివారం సమావేశం నిర్వహించి ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది రూపాయలు వెచ్చించి రోడ్డు విస్తరించారన్నారు. అటువంటి రోడ్డును ఆక్రమించి తోపుడు బళ్లు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని, దీని వల్ల చాలా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఫుట్‌పాత్‌ను ఆక్ర మించి వ్యాపారాలు చేయడంతో పాదచారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వినియోగదారులు రోడ్డు మధ్యలోనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారన్నారు. దీంతో పాదచారులను బస్సులు, ఇతర వాహనాలు వారిని ఢీకొట్టే ప్రమాదం ఉందన్నారు. ఈ స్థితిలో తోపుడు బళ్లతో ఆ క్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ట్రాఫిక్ ఎస్సై వి.వాణిశ్రీ, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి


కళాకారులను సత్కరిస్తున్న సభ్యులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 7 : శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ప్రజలందరి జీవితాలలో వెలుగు నింపాలని వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రైల్వేన్యూకాలనీలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రమౌళి మాట్లాడుతూ, పాత్రికేయులు వారి కుటుంబ సభ్యులంతా ఒకే చోట కలిసి ఉగాది సంబరాలు జరుపుకోవడం ఆనంద దాయకమన్నారు. అనంతరం పల్సర్ బైక్ ఝాన్సీ, ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ రమేష్, జబర్దస్త్ నటుడు రాపేటి అప్పారావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ అధ్యక్షుడు పి.నారాయణ్, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రచయిత శ్రీకాంత్‌కు సత్కారం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 7: ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజాన్ని తమ సేవలతో జాగృతం చేస్తున్న కళాకారులను, పాత్రికేయులను సత్కరించారు. వారిలో నగరానికి చెందినప్రముఖ కవి, రచయిత సత్తివాడ శ్రీకాంత్‌ను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ పౌర సంబంధాల అధికారి మణిరామ్, సీనియర్ పాత్రికేయులు ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

51వ వార్డులో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదాతలు

మురళీనగర్, ఏప్రిల్ 7; 51వవార్డు మాధవధార ఉడా క్వార్టర్స్‌లో ఆదివారం విశాఖ మెరైన్ వింగ్ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని బీజేపీ నాయకులు దిలీప్ రాజు, మూల అప్పారావు ప్రారంభించారు. మెరైన్ వింగ్ నుంచి గత మూడేళ్లుగా పలు సేవా కార్యక్రమాలతోపాటు రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో యువకులు 76 యూనిట్ల రక్తదానం చేశారు. ఎస్.ఆర్.కె.రాజు తదితరులు శిబిరంలో ఉన్నారు.

రామాయణంపై సాహిత్య కార్యక్రమం

సీతమ్మధార, ఏప్రిల్ 7: విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో భవ్యరామారామం ఆధ్యాత్మిక సాహిత్య కార్యక్రమం ఆదివారం పౌరగ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు మాట్లాడుతూ, అయోధ్యలో రామమందిర నిర్మాణం, బాలరామ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యదర్శి డాక్టర్ ప్రయాగ సుబ్రహ్మణ్యం రామాయణం ప్రశస్తిని వివరించారు. నారాయణరావు శ్రీరాముని గుణగణాలు, రామరాజ్యం అనే అంశాలపై వాల్మీకి రామాయణంలో పలు శ్లోకాలు ఉదహరించారు. వి.విజయసారథి అయోధ్యలో రామ మందిర నిర్మాణ నేపథ్యం, మందిర విశేషాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డీవీ సూర్యారావు, విజయ్‌గోపాల్ పాల్గొన్నారు.

పరమత సహనమే.. శాంతికి మూలం


మాట్లాడుతున్న మోహన్‌దాస్

సీతమ్మధార, ఏప్రిల్ 7 : పరమత సహనం కలిగి ఉండడం శాంతికి పునాది అని నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ వి.బాలమోహన్ దాస్ అని అన్నారు.ముస్లింలు పవిత్రం గా భావించే రంజాన్ మాసం సందర్భాన్ని పురస్కరించుకొని బీవీ ఫౌండేషన్ ఫర్‌పీస్, హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్‌బీ కాలేజీలోని గాంధీ సెంటర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలమోహన్ దాస్ మాట్లాడుతూ మతం ఒక నమ్మకమన్నారు. ఈ స్థితిలో అంతా సమభావనతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు, హుస్సేన్, అహ్మద్, ఖాసీం, రజనీకాంత్, బాబూరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మానవ మనుగడకు ప్రకృతి వ్యవసాయమే ఆధారం

- ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం సమావేశంలో నిపుణులు

విశాలాక్షినగర్, ఏప్రిల్ 7 : మానవ మనుగడకు ప్రకృతి వ్యవసాయమే ఆధారమని కళాభారతి అధ్యక్షుడు ఎంఎస్ఎన్‌రాజు అన్నారు. విశాలాక్షినగర్‌లోని బీవీకే కళాశాల ఆవరణలో ఆదివారం ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి రైతుల ఉగాది పురస్కార సమావేశంలో ఆయన మాట్లాడారు. రసాయన రహిత పంటల పెంపకం, వినియోగానికి ప్రజలు అలవాటు పడాలని పిలుపునిచ్చారు. రసాయనాలు, కృత్రిమ వ్యవసాయ విధానాలు రోగాలకు కారణమవుతున్నాయని తెలిపారు. అనంతరం పశుపోషణ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న, పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్న విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత సురపునేని విజయ్‌కుమార్, ఆదర్శ రైతు కొంగర రమేష్, పాత విత్తనాల పరిరక్షకుడు పచారి దేవుళ్లు, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే జట్టు సంస్థ అధినేత పారినాయుడును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సీ మాధవ్, బీవీకే కళాశాల విశ్రాంత అధ్యాపకుడు సత్యారావు, భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ నేత జలగం కుమారస్వామి, రైతు శాస్త్రవేత్త అశోక్‌కుమార్, ఆర్ఎస్ఎస్ నగర సంఘచాలక్ నారాయణరావు, పీఎల్ఎన్‌రాజు, సంఘం కార్యదర్శి అశోక్, సహాయ కార్యదర్శి రుషి, ఆకుల చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

జనసేనానికి నీరాజనం

... 3వ పేజీ తరువాయి

వెలిగించి పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలికారు. సత్యనారాయణ థియేటర్ వద్ద ఒక చంటి బిడ్డను పవన్‌కల్యాణ్ ముద్దాడారు. ఈ ర్యాలీలో మార్గమధ్యంలోని కుంచావారి గౌరీ పరమేశ్వరులు, వేల్పులవీధి గౌరీ పరమేశ్వరులను వాహనం పైనుంచే దర్శించుకున్నారు. ర్యాలీ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు దారి పొడవునా బందోబస్తు నిర్వహించారు.

కొండెక్కిన థీమ్‌పార్క్

... 3వ పేజీ తరువాయి

నగరానికి వచ్చే పర్యాటకులను సైతం ఆకర్షించవచ్చునని జీవీఎంసీ అధికారులు గుర్తించారు. ఇందులోభాగంగా గత ప్రభుత్వ హయాంలోనే జీవీఎంసీ కమిషనర్ ప్రతిపాదనలు పంపించారు. ఇంతలోనే ఎన్నికలు జరగడం, వైసీపీ అధికారంలోకి రావడంతో పార్కు అభివృద్ధి ప్రతిపాదనలు అటకెక్కిపోయాయి. ఆ తరువాత అప్పటి వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా వ్యవహరించిన విజయసాయిరెడ్డితో పాటు వైసీపీ పెద్దల కళ్లు ముడసర్లోవ పార్కుపై పడ్డాయి. పార్కుని పీపీపీ పద్ధతిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. పార్కుతోపాటు రిజర్వాయర్ భూములను విజయసాయిరెడ్డి, కొందరు వైసీపీ పెద్దలు కొందరు జీవీఎంసీ అధికారులతో సహ పరిశీలించారు. పార్కులో చిన్నపిల్లలకు ఆటవస్తువుల ఏర్పాటు, వాకింగ్‌ట్రాక్‌లు, రిక్రియేషన్ సెంటర్‌లు, ఫుడ్‌కోర్టులు, అడ్వంచర్ స్పోర్ట్స్ సదుపాయాలు క ల్పించాలని నిర్ణయించారు. ముడసర్లోవ రిజర్వాయర్‌లో బోటింగ్ సదుపాయం, కంబాల కొండ వరకూ వెళ్లి వచ్చేలా రోప్‌వే ఏర్పాటు ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చే పర్యాటకులను ఆకర్షించవచ్చని భావించారు. తద్వారా ఆదాయాన్ని కూడా పెంచుకోవచ్చునని వైసీపీ నేతలు గొప్పలు చెప్పారు. ఇందుకోసం అవసరమయ్యే మొత్తాన్ని అంచనా వేసి ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. దీంతో మూడేళ్ల కిందట రూ.120 కోట్లతో ముడసర్లోవ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారుచేసి పంపించారు. అయితే ముడసర్లోవ భూములను కొల్లగొట్టేందుకు ప్రణాళిక సిద్ధమవుతోందనే విమర్శల నేపథ్యంలో విజయసాయిరెడ్డి వెనక్కి తగ్గారని, ఫలితంగా ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేయలేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

జీవీఎంసీ నిధులతో పనులకు యత్నం

పార్కు అభివృద్ధికి అడుగులు పడకపోవడంతో నగర వాసుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇవి పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తాయని గుర్తించిన వైసీపీ నేతలు జీవీఎంసీ నిధులతో పార్కు అభివృద్ధి చేసినట్టు కలరింగ్ ఇవ్వాలని భావించారు. ఇందులో భాగంగా జీవీఎంసీ పాలకవర్గంలోని వైసీపీ పెద్దల సూచన మేరకు అధికారులు ఇటీవల రూ.30 లక్షలు జీవీఎంసీ నిధులు వెచ్చించి చిన్నపిల్లల ఆటవస్తువుల ఏర్పాటు, సివిల్‌వర్కుల రిపేర్ల కోసం ప్రతిపాదనలను గత నెలలో జరిగిన చివరి స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించారు. ఎన్నికల్లో నష్టం జరుగుతుందనే భయంతోనే ముడసర్లోవ పార్కులో చిన్న పిల్లల ఆటవస్తువులను మొక్కుబడిగా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రజలను మభ్యపెట్టడం మినహా, ఇంతవరకూ పనులు ప్రారంభించలేదని నగరవాసులు దుమ్మెత్తిపోస్తున్నారు.

ఆరోగ్యశ్రీ బిల్లులకు మోక్షమేదీ?

... 3వ పేజీ తరువాయి

పోయిందని, వైద్య సేవలు నిలిపివేస్తే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటారనే ఉద్దేశంతోనే కొనసాగిస్తున్నామంటున్నాయి.

రోగులకు తప్పని ఇబ్బందులు

నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం బిల్లులను పెండింగ్‌లో పెట్టడంతో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనేక చోట్ల వైద్యసేవలు అందించేందుకు ఆస్పత్రులు ముందుకు రావడంలేదు. అనారోగ్యంతో వస్తే ఆ సమస్య ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో లేదని చెప్పేస్తున్నారు. దీంతో రోగులు ఆస్పత్రుల చుట్టూ తిరగలేక, అప్పు చేసి అదే వైద్యసేవలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ఆస్పత్రులు అయితే కొత్తగా చేరే రోగులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తించదని తేల్చేస్తున్నారు. ఇది మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తోంది.

యాజమాన్యాలపై భారం

నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందే రోగుల్లో సుమారు 80 నుంచి 90 శాతం మంది ఆరోగ్యశ్రీ పథకానికి చెందిన రోగులే ఉంటున్నారు. మిగిలిన వారంతా పేమెంట్, ఇతర స్కీమ్‌ల్లో వైద్యసేవలు పొందుతుంటారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తే సిబ్బందికి వేతనాల చెల్లింపు, ఆస్పత్రుల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు రావని, పెండింగ్‌లో పెట్టేయడంతో అప్పులు చేయాల్సి వస్తోందని యాజ మాన్య ప్రతినిధులు వాపోతున్నారు. ఇప్పటికైనా సకాలంలో బిల్లులు చెల్లిస్తే మెరుగైన వైద్యసేవలు అందుతాయని పలువురు రోగులు పేర్కొంటున్నారు.

ఉలిక్కిపడిన ఫార్మా సిటీ

... 3వ పేజీ తరువాయి

ఆళ్ల గోవింద(32) డ్రయర్ రూము బోల్టు బిగించే క్రమంలో ఒక్కసారిగా డోర్ తెరుచుకుంది. దీంతో లోపల ఉన్న మిథైల్ నైట్రేట్ గ్యాస్ ఒక్కసారిగా రావడంతో పేల్చి కుప్పకూలిపోయాడు. ఈ క్రమంలో డ్రయర్ రూము డోర్ ఓపెన్ అయి శబ్దం రావడంతో సమీపంలో ఉన్న కిటికీ గ్లాస్ పగిలి అక్కడే పనిచేస్తున్న సూపర్‌వైజర్ బి. నరేంద్ర కంటికి తగలడంతో గాయమైంది. అలాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.బాబ్జీ, మరో ఫిట్టర్ బి. గోవింద స్వల్పగాయాలతో బయటపడ్డారు. కాగా కుప్పకూలిన గోవిందను తొలుత అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతుని స్వస్థలం పాలకొండ. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ బాలసూర్యారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమలను సందర్శించిన అధికారులు

ప్రమాదం విషయం తెలుసుకున్న ఆర్డీవో చిన్నికృష్ణ, పరిశ్రమల అధికారి చిన్నారావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శాంతిభూషణ్, సీఐ బాలసూర్యారావు ప్రమాదాలు జరిగిన పరిశ్రమలను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను యాజమాన్యాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందజేయాలని యాజమాన్యాలకు సూచించారు.

ఆరోగ్యవంతమైన సమాజం అవసరం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 7: ఆరోగ్యవంతమైన సమాజం అవసరమని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పీఏపీ, పీపీసీ ఆధ్వర్యంలో 'నా ఆరోగ్యం నా హక్కు' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ చట్ట ప్రకారం ఆర్టికల్ 21 ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని చెబుతుందన్నారు. డా.పి. రామారావు మాట్లాడుతూ, ప్రభుత్వాలు ఆరోగ్య రంగాన్ని పన్నుల ద్వారా ఆదాయవనరుగా చూడడం అన్యా యమన్నారు. డా.రాజు మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరూ శ్రద్ధ చూపాలన్నారు.కార్యక్రమానికి ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు వీవీ సుధాకర్ అధ్యక్షతవహించగా రాష్ట్ర నాయకులు కేవీపీ చంద్రమౌళి పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో వాక్‌థాన్

మహారాణిపేట, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం బీచ్‌రోడ్డులోని లీ హెల్త్ సంస్థ ఆధ్వర్యంలో వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఈ వాక్‌థాన్‌ను సంస్థ చైర్మన్ ప్రవీణ్ రెడ్డి, డైరెక్టర్ ఆళ్ల లీలారాణి ప్రారం భిం చారు.



బీచ్‌రోడ్డు వాక్‌థాన్‌లో ప్రతినిధులు

అనంతరం యోగా విలేజ్ వద్ద ఎముకలు, కీళ్ల వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వ హించారు.

మురళీనగర్; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు హాజరై స్థానికులకు ఆరోగ్య సమస్యలపై సందేహాలను నివృత్తి చేశారు. మురళీనగర్, మాధవధార ప్రాంత వాసులు హాజరైన ఈ కార్యక్రమంలోక్లబ్ అధ్యక్షులుపల్లా.చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్లారా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

10న టీడీపీలోకి భీమిలి జడ్పీటీసీ

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 7 : మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులతో పాటు జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు ఈనెల 10న టీడీపీలో చేరనున్నారు. ఆ రోజు మహరాజుపేట జంక్షన్ నుంచి మజ్జివలస రాసపోలమ్మ ఆలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకానున్న టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు సమక్షంలో మజ్జివలస, సింగనబంద, మజ్జిపేట, దాకమర్రి, బోడమిట్టపాలెం, తాళ్లవలస, తాటితూరు, లక్ష్మీపురం, నారాయణరాజుపేట గ్రామాలకు చెందిన సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో చేరనున్నట్టు పార్టీ నాయకులు తెలిపారు.

అప్పన్నకు ఘనంగా గరుడసేవ

సింహాచలం, ఏప్రిల్ 7 : వరాహలక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా ఉదయం ఆలయ కల్యాణ మండపంలో రజిత గరుడ వాహనంపై ఉత్సవమూర్తి గోవిందరాజాస్వామిని అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి షోడశోపచారాలతో పూజలు చేశారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళితో అర్చించిన తరువాత భక్తుల నాదస్వరాలపనల నడుమ గరుడ వాహనం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ చేశారు. స్వామివారికి కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఎండాడలో ఉగాది సంబరాలు

ఎండాడ, ఏప్రిల్ 7 : జీవీఎంసీ 8వ వార్డులోని శ్రీరామ్ ప్రాపర్టీస్ రోడ్డులోని మైదానంలో ఎండాడ అథ్లెటిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి నర్రా సీతామహాలక్ష్మీ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది సంబరాలు నిర్వహించారు.ఈసందర్భంగా పెద్దలు చిన్నారులకు ఉగాది విశిష్టతను వివరించారు. సంప్రదాయ దుస్తులు ధరించి వచ్చిన వారందరికీ తెలుగు సంవత్సరాది వంటకాలు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు భీమాస్ అధినేత రమేష్, రాజేంద్రప్రసాద్, రాజేశ్వర్‌రెడ్డి, రాజేష్, రామలక్ష్మి, ఓఎస్‌జీ ఫౌండేషన్ నిర్వాహకుడు శివ, తదితరులు పాల్గొన్నారు.

పొట్నూరులో నూకాలమ్మ పండగ రేపు

పద్మనాభం, ఏప్రిల్ 7 : మండలంలోని పొట్నూరు గ్రామంలో నూకాలమ్మ పండగ మంగళవారం జరగనుంది. రెడ్డిపల్లి, పొట్నూరు గ్రామాల మధ్య ఉన్న ఈ ఆలయంలో ఉత్సవాన్ని ఇరు గ్రామాల ప్రజలు నిర్వహిస్తారు. 8న తొలేళ్ల ఉత్సవం, 9న అనుపోత్సవం నిర్వహిస్తారు.

తోటగరువులో డబుల్ రోడ్డు పనులు

ఆరిలోవ, ఏప్రిల్ 7 : తోటగరువు హైస్కూలు మార్గంలో డబుల్ రోడ్డు పనులు చేస్తున్నారు. వాస్తవానికి రెండు నెలలు క్రితమే ఈ పనులు చేయాల్సి ఉంది. కానీ ఇన్నాళ్లూ కాలయాపన చేసి ఇప్పుడు పనులు చేస్తుండడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విద్యార్థులకు అందని విద్యా దీవెన

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 7 : విద్యా సంవత్సరం ముగిసిపోతున్నా.. వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు విద్యాదీవెన ఇవ్వలేదని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో విమర్శించారు. పరీక్షలు రాయాల్సిన సమయంలో విద్యార్థులకు జగన్ సర్కారు కొత్త పరీక్షలు పెడుతోందని ఎద్దేవా చేశారు. జగన్ మార్చి 1న బటన్ నొక్కినా, ఇంకా ఎందుకు జమ కాలేదో సెలవియ్యాలని కోరారు.

మత్స్యకారులకు లాంతర్లు పంపిణీ



భీమునిపట్నం, ఏప్రిల్ 7 : జీవీఎంసీ 4వ వార్డు సీహెచ్ ఉప్పాడ బ్లూ మెరినో విల్లాస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేవి కంఫర్ట్ లైఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు యాళ్ల భాగ్యలక్ష్మి ఆదివారం 108 మంది మత్స్యకారులకు సెలైన్ వాటర్ లాంతర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారులకు ఈ లాంతర్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సముద్రపు నీటితో వెలిగే ఈ లాంతర్లను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అలాగే నిరుపేద మత్స్యకార మహిళలకు చీరలు కూడా అందజేశారు.

సినిమా గైడ్

● **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, శారద, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-1, హెవెన్, లక్ష్మీకాంత్ (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)

● **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)

● **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 28, బీరకాయలు 36, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారేట్ 26, దొండకాయలు 18, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది) 155, బరబటి 22, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 28, దోస కాయలు 12, వె ల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 52, పొటల్స్ 50, కీరదోస 22, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	405
విజయనగరం	409
శ్రీకాకుళం	409

చికెన్ ధరలు		
బ్యాగ్		
రైతు ధర	--	130
ఫారం ధర	--	150
విత్ స్కిన్	--	270
స్కిన్‌లెస్	--	280

మరికొన్ని సిటీ వార్తలు పేజీ III లో..



ఎండాడ : సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు


టీడీపీలో చేరిన ఆనందపురం మండల వైసీపీ నాయకులు

భీమిలిలో కూటమి గెలుపు తథ్యం

- టీడీపీ అభ్యర్థి గంటా
- జనసేన ఆత్మీయ సమావేశం

ఎండాడ, ఏప్రిల్ 7 : భీమిలి నియోజకవర్గంలో తాను అత్యధిక మెజారిటీతో గెలవడం ఖాయమని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన 8వ వార్డు ఎండాడలోని జనసేన పార్టీ కార్యాలయంలో జన సైనికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏదో మంచి చేస్తాడనుకుంటే అధికారంలోకి వచ్చిన వెంటనే కరకట్ట ప్రాంతంలో ఉన్న ప్రజా వేదికను కూల్చివేసి విధ్వంసం చూపించారన్నారు. గతంలో ఏముఖ్యమంత్రి చేయని విధంగా పోలీసు యంత్రాంగాన్ని వినియోగించుకుని ప్రతిపక్షాలపై ఉసిగొల్పి దాడులు చేయించారని ఆరోపించారు. ఏపీలో జరుగుతున్న పరిస్థితులను గమనించిన పవన్‌కల్యాణ్ రాజకీయ బెట్టుకుపోకుండా రాష్ట్రాన్ని వైసీపీ నుంచి కాపాడాలన్న మంచి ఉద్దేశంతో ఉమ్మడి కూటమిని ప్రతిపాదించారని వివరించారు. పవన్ నిస్వార్థమైన వ్యక్తి అనిఇగోలకు స్థానం లేని రాజకీయ నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. విజయం సాధించాక జనసైనికులకు తమతో సమానంగా పదవులతో గౌరవిస్తామని, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి పంచకర్ల సందీప్‌కు సముచిత గౌరవం, పదవీ ఇచ్చే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈనెల 8 నుంచి ఉమ్మడి సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి 10 నుంచి ప్రత్యర్థులకు మించి ప్రచారం చేపడతామన్నారు. ఈ సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, గంటా తనయుడు రవితేజ, 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్, 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి గొట్టిపల్లి వైసీపీ నాయకులు

భీమునిపట్నం : ఆనందపురంలోని గొట్టిపల్లి పంచాయతీకి చెందిన వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. వారికి బీచ్‌రోడ్‌లో వున్న పార్టీ కార్యాలయంలో భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఆదివారం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గొట్టిపల్లి మాజీ సర్పంచ్ నాయుడుబాబు, ఎర్రబంగారునాయుడు (బన్ని), పరదేశినాయుడు, ఆకుల అప్పలనాయుడు, త్రిమూర్తులు, జగన్నాథరావు, పాలవలస వెంకటరావు, బంటుబిల్లి అప్పలనాయుడు, బూర్ల అప్పలరాజు, కంది సత్యంనాయుడు, త్రిపునగిరి సూరినాయుడు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోరాడ కుమారుడు శంకర్, సుంకరి శివ, దొంతల శ్రీరామ్, కొలగాని రమణ పాల్గొన్నారు.


స్కైలైన్ అపార్ట్‌మెంట్‌లో ప్రచారం చేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైసీపీ పాలన

- భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎండాడ/మధురవాడ ఏప్రిల్ 7 : రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైసీపీ పాలన చేసిందని ఆ పార్టీ భీమిలి అభ్యర్థి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన 8వ వార్డులోని ఎండాడ స్కైలైన్ అపార్ట్‌మెంట్స్, ఎండాడ - రుషికొండ డబుల్ రోడ్డు, ఎండాడ చెరువు ప్రాంతంలోని మినిస్ట్రీస్ చర్చ్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండాడలో కాలువలు, థీమ్ పార్కులు, రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు అర్హత ఉన్న ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామని, వైసీపీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ నొడగల అప్పారావు, నాయకులు పోలిరెడ్డి, మెంబర్ గోపి, రామ్మోహన్, మాదు చంటి, బాలకృష్ణ, పాల్గొన్నారు. అలాగే ఏడో వార్డు మధురవాడ పరిసరాల్లోని పలు అపార్ట్‌మెంట్ల వద్ద కూడా ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విశాఖ పరిపాలనా రాజధానికి అనుకూలమైన ప్రాంతమన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలన్నారు. తాను ఐదేళ్లుగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మధురవాడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ముత్తంశెట్టి

టీడీపీ బీసీ నేతలను తయారు చేసే ఫ్యాక్టరీ : గంటా

సిరిపురం, ఏప్రిల్ 7 : బీసీ నేతలను తయారు చేసే ఫ్యాక్టరీ టీడీపీ అని ఆ పార్టీ భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సిరిపురంలో జరిగిన రజక సామాజికవర్గ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమిలిలో వచ్చే మెజార్టీ సౌండ్‌కు రాష్ట్రం దద్దరిల్లాలన్నారు. వైసీపీ అధికారంలో వచ్చాక రజక కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ అధికారాలు ఇవ్వకుండా ఉత్సవ విగ్రహాలుగా మార్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు దుర్వారపు రామారావు, రజక సామాజికవర్గం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ కోరారు. ఆదివారం ఆయన 22వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఒమ్మి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు విద్యుత్ స్తంభాలకు ఉండవా?


మండల కాంప్లెక్సు ఆవరణలో వైసీపీ జెండా రంగులతో ఉన్న విద్యుత్ స్తంభం, జెడ్పీ అతిథి గృహం



పద్మనాభం, ఏప్రిల్ 7 : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన తరువాత అధికారులు వైసీపీ జెండా రంగులు ఉన్నవాటిని చాలా వరకు తొలగించినా కొన్నింటిని ఇప్పటికీ అలానే వదిలేశారు. మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో ఉన్న హైమాస్ట్ ఎల్ఈడీ లైటు స్తంభానికి వైసీపీ జెండా రంగులు ఉన్నా.. వాటిని మార్చలేదు. అలాగే మద్ది, పద్మనాభం ఆలయం వద్ద ఉన్న స్తంభాలకు కూడా వైసీపీ జెండా రంగులే ఉన్నాయి. పద్మనాభంలోని జిల్లా పరిషత్ అతిథి గృహం గేటు కూడా అదే పరిస్థితి.

నూకాలమ్మ ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన

భీమునిపట్నం, ఏప్రిల్ 7 : పట్టణంలో సోమవారం నుంచి జరిగే నూకాలమ్మ అమ్మవారి ఉత్సవ ఏర్పాట్లను నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ అయ్యర్ ఆదివారం పరిశీలించారు. భక్తుల దర్శనాలకు ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చూశారు. గ్రామంలో రోడ్లు చిన్నవిగా ఉండడంతో భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గంటస్తంభం కూడలి, బీచ్‌రోడ్, నృశింహస్వామి కొండ రహదారులను పరిశీలించారు. అంతకముందు ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ నార్త్ ఏసీపీ సునీల్, ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్, సీఐ రమేష్, ఎస్ఐ హరీష్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గిడుతూరి డెక్కన్ శ్రీనివాసరావు, సీనియరు సిటిజన్లు మైలపల్లి షణ్ముఖరావు,గంటా నూకరాజు, అల్లిపిల్లి నరసింగరావు, కదిరి ఎల్లాజి, కంటుభుక్త ముత్యాలరావు, పీరుపల్లి రాజు, రాకోతు నర్సింగరావు, నాగిరెడ్డి వెంకటస్వామి, అప్పికొండ బాలకృష్ణ, రాంభుక్త ప్రభాకరనాయుడు, కొక్కిరి అప్పన్న పాల్గొన్నారు


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న సిపి రవిశంకర్

భీమిలిలో ట్రాఫిక్ ఆంక్షలు

ఉత్సవాలను పురస్కరించుకుని పోలీసులు పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సోమవారం నుంచి బుధవారం వరకూ ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి. విజయనగరం, తగరపువలస వైపు నుంచి వచ్చే కార్లు, బైక్‌లు, ఆటోలు భీమిలి ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో పార్కింగ్ చేయాలి. ఆనందపురం, విశాఖ నుంచి భీమిలి క్రాస్ రోడ్ మీదుగా వచ్చే వాహనాలు యోగాశ్రమం వద్ద, నగరం నుంచి బీచ్‌రోడ్ మీదుగా వచ్చే వారు ఏపీఆర్ స్కూల్, నేరేళ్లవలస కాలనీ వద్ద పార్క్ చేయాలి. భీమిలి టౌన్ నుంచి వచ్చేవారు సెయింట్ ఆన్స్ హైస్కూల్ గ్రౌండ్ లోనూ, వీఐపీ పాసులు వున్న వారు తమ వాహనాలను డైట్ కాలేజీ దిగువ రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేసుకోవాలి. భీమిలి క్రాస్ రోడ్స్ మీదుగా వచ్చే బస్సులను చిన్నబజారు మీదుగా కొత్త బస్టాండ్ వద్ద నిలుపుదల చేయాలి. బీచ్ రోడ్డు మీదుగా వచ్చే సిటీ బస్సులు ఏపీఆర్ స్కూల్ వద్ద టర్న్ చేసుకోవాలి. బీచ్‌రోడ్ మీదుగా విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే వాహనాలు నేరేళ్లవలస కాలనీ, నృసింహస్వామి గుడి, చిన్నబజారు జంక్షన్ మీదుగా క్రాస్ రోడ్‌లో నిలుపుదల చేయాలి. సెయింట్ ఆన్స్ స్కూల్ నుంచి ఏపీఆర్ స్కూల్ వరకు, బీచ్‌రోడ్‌లో ఏ వాహనాలను అనుమతించరు. అలాగే ఎస్‌బీఐ జంక్షన్ నుంచి డైట్ కాలేజీ వరకూ వాహనాలను అనుమతించరు.

నిబంధనలకు విరుద్ధంగా బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణం


బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణం

సింహాచలం, ఏప్రిల్ 7 : బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణంలో అధికారులు అప్పటికప్పుడు కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీనివల్ల రోడ్డుకు సమీపంలోని నిర్వాసితులు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన సింహాచలం కారిడార్ నిర్మాణం గత నవంబరులో హడావిడిగా పునః ప్రారంభించారు. తొలుత నిర్దేశించిన ప్రణాళిక పక్కన పెట్టి అప్పటికప్పుడు కొన్ని మార్పులు చేస్తూ రోడ్డు నిర్మాణాన్ని వేగవంతం చేశారు. అదే క్రమంలో ప్రస్తుతం కుమ్మరి వీధి సమీపంలోని మాధవి కల్యాణ మండపం నుంచి దేవస్థానం టోల్‌గేటు ఎదురుగా ఉన్న కర్రి అప్పలస్వామి కల్యాణ మండపం వరకు ఉత్తరం వైపు తొలుత తవ్విన దాని కంటే అధికంగా సుమారు మరొక ఐదు అడుగుల వెడల్పు తవ్వేసారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల నష్టపోయిన వారికి ముందస్తు సమాచారం లేదని, దానికి సంబంధించిన నష్టపరిహారం కాని అదనపు టీడీఆర్‌లు కాని ఇస్తారా లేదా అన్నది చెప్పకుండా పనులు చేసుకుపోతుండడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈనెల 19న జరిగే అప్పన్న వార్షిక తిరుకల్యాణోత్సవం, మే 10న జరిగే చందనోత్సవాల సమయానికి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. అసంపూర్తిగా నిర్మాణం జరిగితే అటు భక్తులతో పాటు ఇటు అడివివరం గ్రామస్థులు ఉత్సవాల వేళ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా నూకాలమ్మ తొలేళ్ల జాతర

వెంకోజిపాలెం, ఏప్రిల్ 7 : జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో నూకాలమ్మ జాతర ఆది వారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజు తొలేళ్ల ఉత్సవం జరిపారు. గ్రామస్థులంతా అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులు సమర్పించారు. తెల్లవారుజాము నుంచి అర్చకుడు డి. వెంకటాచార్యులు శర్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బుగత సత్యనారాయణ, ఆర్. నరేంద్ర, బోను శ్రీను, కాళ్ల నరసింగరావు, కె. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : చినగదిలి తహసీల్దార్ కార్యాలయం పాత డెయిరీ ఫారానికి సమీపంలో ఉన్న నూకాలమ్మ జాతరలో భాగంగా సోమవారం ప్రధాన ఉత్సవం జరగనుంది. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు. సాయంత్రం జరిగే పరస సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.


చిన్నారులతో జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా

వన్య ప్రాణుల సంరక్షణ పట్ల అవగాహన

ఆరిలోవ, ఏప్రిల్ 7 : వన్య ప్రాణుల సంరక్షణ పట్ల చిన్నారులకు అవగాహన అవసరమని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా అన్నారు. ఆదివారం జూపార్కులో జాతీయ జంతు ప్రేమికుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడూతూ వన్య ప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సదరన్ గ్రూప్ సీఎండీ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం


ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ సుధాకర్

తగరపువలస, ఏప్రిల్ 7 : సంగివలస దంత వైద్య కళాశాల విద్యార్థులు ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కళాశాల డీన్ డా.సుధాకర్ ప్రారంభించిన ఈ ర్యాలీ ఆర్‌కే బీచ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ నా ఆరోగ్యం నా హక్కు అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు విజయ,వాణి ప్రియాంక, శివప్రసాద్ పాల్గొన్నారు.

'చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి భవిత'


సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 : టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు సుపరిపాలన అందుతుందని టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ అన్నారు. ఆదివారం వార్డులో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో అందరూ సమష్టిగా పనిచేసి తూర్పు, భీమిలి ఎమ్మెల్యేలుగా వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావు, ఎంపీగా శ్రీభరత్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మళ్ల రవికుమార్, గోవింద్, కర్రి గౌరీ, వెంకటలక్ష్మి, నరేంద్ర, సోని, జనసేన వార్డు అధ్యక్షురాలు కళావతి, బీజేపీ అధ్యక్షుడు పాపారావు, రమణ పాల్గొన్నారు.

వైసీపీని గెలిపించండి : ఎంవీవీ



సభలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆరిలోవ, ఏప్రిల్ 7 : జీవీఎంసీ 12వ వార్డు మేయర్ క్యాంపు కార్యాలయం సమీపంలోని సర్వీసు రోడ్డులో ఆదివారం రాత్రి వైసీపీ సిద్ధం సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ, తూర్పు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల్లో విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పి. నారాయణ, కార్పొరేటర్ రోహిణి, నాయకులు గొలగాని శ్రీనివాస్, పాత్రుడు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. కాగా ఓటర్లను ప్రలోభపెట్టడానికి వైసీపీ కొత్త ఎత్తుగడలు వేస్తోంది.సిద్ధం సభకు వచ్చిన వారికి గృహ సారధులు కూపన్లు ఇచ్చారు. దానికి ఒక రంధ్రం పెట్టి, ఎమ్మెల్యే అభ్యర్థి పేరు, బూత్ నెంబరు, తాయిలాం ఇవ్వనున్న తేదీ ముద్రించారు. ముస్లింలకు రంజా తోఫా గిఫ్టులు సిద్ధం చేశారు.కూపన్‌ను గృహసారధికి చూపిస్తే వారు గిఫ్టున్ లేదా డబ్బులు ఇస్తారు. అలాగే సభ వల్ల స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 1 గంట నుంచి రోడ్డును బంద్ చేయడంతో నరకయాతన అనుభవించారు.

ఆర్‌కే బీచ్‌లో ముస్లింల ప్రార్థనలు



రామ్‌నగర్, ఏప్రిల్ 7 : ఆర్‌కే బీచ్‌లో రంజాన్ మాసం సందర్భంగా వన్‌టౌన్ కోటవీధి హజీ అబూ సరంగ్ మసీద్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఆదివారం ఇఫ్తార్ విందు ఇచ్చారు.ముందుగా ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇఫ్తారు విందు ఇచ్చారు.

రుషికొండ తీరంలో సందర్శకుల సందడి


సందర్శకులతో సందడిగా కనిపిస్తున్న రుషికొండ తీరం

సాగర్‌నగర్, ఏప్రిల్ 7 : రుషికొండ, సాగర్‌నగర్ తీర ప్రాంతాలకు పర్యాటకులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో నగరం నలుమూలలుతో పాటు విజయనగరం జిల్లా నుంచి కూడా సందర్శకులు తరలిరావడంతో బీచ్‌లు కిటకిటలాడాయి. కొందరు సముద్ర స్నానాలు చేయగా, మరికొందరు బోటు షికార్ చేశారు.

జూపార్కుకు పర్యాటకుల తాకిడి

ఆరిలోవ : నగరంలోని జూపార్కుకు ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది.సుమారు 1670 మంది పర్యాటకులు జూను సందర్శించారు. వారి నుంచి రూ. 1.47 లక్షల ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ తెలిపారు,

ప్రజల ఆకాంక్షలకు తూట్లు పొడుస్తున్న ప్రభుత్వాలు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 7: ప్రజల ఆకాంక్షలకు తూట్లు పొడుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పతనం తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,151వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టిన వారెవరైనా చరిత్రహీనులుగా మిగులుతారన్నారు.